
ఈనాడు
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం అక్టోబరు 19, 2024

వైభవం.. విజయబేతాళుని విహారం

డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటలో శుక్రవారం రాత్రి విజయబేతాళస్వామి వాహన మహోత్సవం వైభవంగా సాగింది. అంబాజీపేటలోని 13 శెట్టిబలిజపాలేలకు చెందిన వివిధ దేవతామూర్తుల విగ్రహాలతో వాహనాలు పురవీధుల్లో ఊరేగుతూ స్థానిక కూడలిలో కొలువుదీరి భక్తులకు కనువిందు చేశాయి. అంబాజీపేట, మాచవరం శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో.. శ్రీనివాసనగర్‌లోని విజయబేతాళస్వామి ఆలయం నుంచి ఈ సంబరాలు ప్రారంభమయ్యాయి. విద్యుద్దీపాలంకరణలతో అలంకరించిన వాహనాలు మేళతాళాల నడుమ పురవీధుల్లో సాగాయి. చెడీతాలింఖానా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువకులు చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి.

-న్యూస్‌టుడే, అంబాజీపేట


మాచవరంలో శ్రీకృష్ణుడి వాహనం


వాహన ఊరేగింపు


వాహన మహోత్సవంలో కత్తులతో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, నాయకులు

మనకూ ఉంది డ్రోనాస్త్రం



ఈనాడు, రాజమహేంద్రవరం: వరద నష్టం..నేర ఛేదన.. మందుల పిచికారీ.. ఆక్రమణల గుర్తింపు, రాత్రి గస్తీ.. ఇలా డ్రోన్‌లు చక్కబెట్టే పనులెన్నో. మన ఉమ్మడి జిల్లాలోనూ డ్రోన్లను పలు శాఖలు వాడుతున్నాయి. 22, 23 తేదీల్లో అమరావతిలో డ్రోన్ సమ్మిట్ జరగనుండటంతో ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో మనవద్ద డ్రోన్‌ల పాత్ర ఎలా ఉందో పరిశీలిస్తే..

- ☛ తూర్పులో రాత్రి గస్తీలోనూ వినియోగం
- ☛ కోనసీమలో సిద్ధమవుతోన్న డ్రోన్ పైలట్లు

సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా

తూర్పుగోదావరి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం నాలుగు డ్రోన్లు పనిచేస్తున్నాయి. పండగలు, రద్దీ వేళల్లో పరిస్థితిని చిత్రీకరిస్తూ కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షిస్తూ ఎస్పీ నరసింహకిశోర్ సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నారు. దసరా ఉత్సవాలు, గోదావరి వరదలు, ఇటీవల కొవ్వూరులో ఉద్రిక్త వాతావరణం నెలకొన్న సమయంలో విస్తృతంగా డ్రోన్లు వినియోగించారు. రాత్రివేళల్లో సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా ఉంచి ఎక్కడ అవాంఛనీయ ఘటనలు, నేరాలు చోటుచేసుకున్నా.. అనుమానిత వ్యక్తులు తిరుగుతున్నా సమీప గస్తీ సిబ్బందిని అప్రమత్తం చేసేలా వ్యవస్థ ఏర్పాటుచేశారు. డ్రోన్ల నిర్వహణపై ఇటీవల 15 మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మరో 10 డ్రోన్ల కోసం ప్రభుత్వానికి నివేదించారు.


రాజమహేంద్రవరంలో పోలీసు సిబ్బందికి శిక్షణ

ఆక్రమణల పనిపట్టేలా..

కొలువల ఆక్రమణలు గుర్తించేందుకు డ్రోన్ కార్పొరేషన్ నుంచి డ్రోన్లను అద్దెకు తీసుకుని తూర్పుగోదావరి కలెక్టర్ ప్రశాంతి సర్వేలు చేయించారు. కొవ్వాడ, ఎర్ర, బురద కాలువల కబ్జాలు.. గండ్లు కొట్టిన, నిర్మాణాలు దెబ్బతిన్న ప్రాంతాలను డ్రోన్లతో గుర్తించి నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ఇటీవల రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రెండు డ్రోన్లతో వార్డుల్లో తనిఖీల ప్రక్రియకు కమిషనర్ కేతన్ గర్గ్ శ్రీకారం చుట్టారు. వీధుల్లో వ్యర్థాలు, పూడిక తీయని కాలువలను గుర్తిస్తున్నారు.


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో డ్రోన్

100 మందితో ప్రత్యేక సైన్యం

డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 100 మంది గ్రామ సర్వేయర్లకు డ్రోన్‌ల నిర్వహణపై అమరావతిలో కలెక్టర్ మహేశ్‌కుమార్ శిక్షణ ఇప్పిస్తున్నారు. డ్రోన్ కార్పొరేషన్ సహకారంతో ఇప్పటికే 30 మంది తర్ఫీదు పొందారు. నెలాఖరుకు అందరికీ పూర్తిచేసి డ్రోన్ పైలట్లతో సైన్యాన్ని సిద్ధం చేస్తున్నారు. అక్రమ ఆక్వా సాగు, కాలువల కబ్జాలు, వరదల అంచనా, రైల్వే లైనుకు భూసేకరణ, ఇసుక తరలింపు పర్యవేక్షణకు ఈ సైన్యాన్ని వినియోగిస్తారు. ఇప్పటికే రైల్వేలైన్ భూసేకరణకు సంబంధించి భట్నవిల్లి-పేరూరు మధ్య ఉన్న నిర్మాణాలను డ్రోన్లతో గుర్తించారు.


ఏలేరు వరద సమయంలో పరిస్థితిని డ్రోన్‌లో చిత్రీకరించారిలా..

ఏలేరు వరద నష్ట నివారణలో కీలకపాత్ర

ఇటీవల ఏలేరు వరదల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాల నివారణలో డ్రోన్లు కీలకపాత్ర పోషించాయి. మొత్తం 8 డ్రోన్లతో ప్రభావిత ప్రాంతాలను జల్లెడ పట్టేలా కలెక్టర్ షాన్‌మోహన్ చర్యలు చేపట్టారు. ఏటిగట్లు బలహీనంగా ఉన్నచోట ఇసుక బస్తాలతో పటిష్ఠం చేస్తూనే, గ్రామాల్లోకి నీరు పోటెత్తకుండా 72 ప్రాంతాల్లో గండ్లు కొట్టించారు. 9 మండలాల పరిధిలో 114 ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు.

సౌర రథానికి.. సారథులేరీ!



ఈనాడు, కాకినాడ: సూర్యకాంతి నుంచి విద్యుత్తును తయారుచేసుకోవడం మానవాళికి క్షేమదాయకమని ప్రపంచ దేశాలు కోడై కూస్తున్నాయి. ఆ దిశగా చైతన్యం మాత్రం మన వద్ద కొరవడుతోంది. పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (నెడ్‌క్యాప్)ను గత వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. రాయితీల ఊతం ఇవ్వలేదు సరికదా.. ఆ శాఖను పర్యవేక్షించాల్సిన నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్ల పోస్టులు ఖాళీ అయినా భర్తీకి కనీస చొరవచూపలేదు.

అన్ని జిల్లాల్లోనూ మేనేజర్ల పోస్టులు ఖాళీ

గతంలోనే ఉద్యోగ విరమణ చేసినా..

కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు నెడ్‌క్యాప్ శాఖలో జిల్లా మేనేజర్లు లేరు. గత ప్రభుత్వ హయాంలోనే ఈ పోస్టులు ఖాళీ అయినా పట్టించుకోలేదు. దీంతో ఇదే కార్యాలయంలోని అభివృద్ధి అధికారులు ఇక్కడ పాలన వ్యవహారాలు చూస్తున్నారు. నాలుగు జిల్లాలకు ఇన్‌ఛార్జిగా వ్యవహరించే కాకినాడ జిల్లా మేనేజర్ సత్యనారాయణ 2023 ఆగస్టులో పదవీవిరమణ చేశారు. అప్పట్నుంచి ఈ శాఖకు సారథులే లేరు. శ్రీకాకుళం నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకు నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్ల పరిస్థితి పరిశీలిస్తే.. ఒక్క ఎన్టీఆర్ జిల్లాలోనే ఉన్నారు. వైకాపా ప్రభుత్వంలోనే పలువురు ఉద్యోగవిరమణ చేశారు. విశ్రాంత ఉద్యోగులు ఒప్పంద పద్ధతిలోనైనా తమను మళ్లీ జిల్లా మేనేజర్లుగా నియమించాలని అప్పటి ప్రభుత్వాన్ని కోరినా ఉలుకూపలుకూ లేదు. దీనికితోడు నెడ్‌క్యాప్ పాలసీలు, ప్రోత్సాహం కరవవడం.. కనీసం కేంద్రం ఇచ్చే రాయితీ సౌర పంపుసెట్ల పథకాన్నీ సద్వినియోగం చేసుకునే పరిస్థితి లేక వ్యవస్థ గతితప్పింది.


కాకినాడలోని నెడ్‌క్యాప్ కార్యాలయం

పంచాయతీరాజ్, జలవనరులశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యారోగ్య, మున్సిపాలిటీలు, రెవెన్యూ ఇలా 37 కీలక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల విద్యుత్తు బకాయిలు రూ.861.54 కోట్లు ఉన్నాయి. బిల్లులు చెల్లించడానికి నిధుల్లేక కొన్ని శాఖలు చేతులెత్తేసే పరిస్థితి.. దీనిని అధిగమించాలంటే సౌర విద్యుత్తే శరణ్యం.

కార్యాలయాలకు భారం తగ్గాలంటే..

గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన నెడ్‌క్యాప్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో కదలిక వచ్చినట్లయ్యింది. సౌర విద్యుత్తు దిశగా ప్రోత్సాహానికి అడుగులు వేయడంతో నెడ్‌క్యాప్‌కు ఊపిరి వచ్చింది. ప్రభుత్వ కార్యాలయాలపై రూఫ్‌టాప్ సౌర విద్యుత్తుకు గత నెల నుంచి సర్వే చేస్తున్నారు. ఇది సాకారమైతే.. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్తు భారం రూ.కోట్లలో తగ్గినట్లే. ప్రభుత్వ ఉద్యోగులకు విద్యుత్తు ద్విచక్ర వాహనాలంటూ గత ప్రభుత్వం హడావుడి చేసి రకరకాల ప్రణాళికలు తెచ్చినా.. పట్టాలెక్కించలేకపోయింది. ఈ తరహా వాహనాల కొనుగోలును ప్రోత్సహిస్తే ఇంధన ఖర్చులు, కాలుష్యం తగ్గేవీలుంది. రాజమహేంద్రవరంలో ఆటోలకు రెట్రోఫిట్ చేసి ఇంధన ఖర్చులు తగ్గిస్తామని గతంలో సర్వేచేసినా.. తర్వాత ఆ జాడ లేదు. ఇవన్నీ కార్యరూపం దాల్చాలి. ఇంధన భారం, కాలుష్యం పెరిగి.. జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్న నేపథ్యంలో సరైన ప్రోత్సాహం అందించాల్సి ఉంది.

యూజర్ ఛార్జీలు బొక్కేశారు

కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్ల చేతివాటం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ నగరపాలక సంస్థలో యూజర్ ఛార్జీల (చెత్త సేకరణ పన్ను) అక్రమ వసూళ్ల బాగోతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వాణిజ్య, వ్యాపార సంస్థలను లక్ష్యంగా చేసుకుని కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు జేబులు నింపుకొన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి నగరపాలక సంస్థలో చెత్త సేకరణ పన్ను వసూలు నిలిపివేశారు. వైకాపాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి ఎన్నికల్లో లబ్ధికోసం రెసిడెన్షియల్, కమర్షియల్ యూజర్ ఛార్జీల వసూలు ఆపేశారు. కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు కుమ్మక్కై యథావిధిగా వసూలు చేశారు. వివరాలు యాప్‌లో నమోదు చేయకుండా, ఆదాయాన్ని కార్పొరేషన్‌కు జమ చేయకుండా, సొంతంగా రసీదులు సృష్టించారు. ట్రేడ్ లైసెన్స్‌ల్లోనూ చేతివాటమే.

డొంక కదిలిందిలా.. నగరపాలక సంస్థ పరిధిలో ప్రతీనెలా రూ.72లక్షలు వసూలవుతాయి. అందులో 40 శాతం కమర్షియల్ అసెస్‌మెంట్స్ నుంచి వస్తుంది. సాధారణంగా యాప్ ద్వారా మాత్రమే చెల్లించాలి. లేదంటే పాత మున్సిపల్ కార్యాలయంలోని కేంద్రంలో చెల్లించి పత్రం తీసుకోవాలి. అలా కాకుండా కొందరు అధికారులు, సిబ్బంది కుమ్మక్కై ఆసుపత్రులు, హోటళ్లు, రెస్టారెంట్లు, సంస్థల నుంచి తొమ్మిది నెలల కాలంలో రూ.కోటి వరకు వసూలు చేసి నొక్కేశారు. జేసీ రాహుల్‌మీనాకు ఫిర్యాదు అందడంతో అక్రమాల డొంక కదులుతోంది. 33, 34, 35 డివిజన్ల పరిధిలోకి వచ్చే 10వ శానిటేషన్ సర్కిల్‌లో ఎక్కువగా అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ 803 కమర్షియల్ అసెస్‌మెంట్స్ ఉన్నాయి. నెలకు రూ.2.60లక్షల చొప్పున రూ.30 లక్షలు అనధికారికంగా యూజర్ ఛార్జీలు వసూలు చేశారు.

21 నుంచి వాడపల్లిలో ఆర్జిత సేవలు రద్దు

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 21 నుంచి 29 వరకు అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణం, ఇతర ఆర్జిత సేవలన్నీ రద్దు చేస్తున్నట్లు దేవస్థానం ఈవో ఎన్.సూర్యచక్రధరరావు తెలిపారు. మళ్లీ ఈనెల 30వ తేదీ నుంచి ఆర్జిత సేవలు యథావిధిగా నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు భక్తులు 08855-271888 ఫోన్ నంబరులో సంప్రదించాలని కోరారు.



యువజనోత్సవాల్లో ప్రదర్శన చేస్తున్న యువతులు

ప్రతిభ వెలికి తీసేందుకే యువజనోత్సవాలు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి, వారికి ప్రభుత్వం పరంగా ప్రోత్సాహం అందించేందుకే యువజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జేసీ నిశాంతి తెలిపారు. శుక్రవారం అమలాపురం అంబేడ్కర్ భవన్‌లో జిల్లా స్థాయి యువజనోత్సవ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గతంలో ఉమ్మడి జిల్లా పరిధిలో కాకినాడలో నిర్వహించే వారమని, కొత్త జిల్లాల ఏర్పాటుతో స్థానికంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మొత్తం 12 విభాగాల్లో యువతకు పోటీలు ఏర్పాటు చేసినట్లు సెట్రాజ్ అధికారులు తెలిపారు. 821 మంది దరఖాస్తులు చేసుకోగా 12 విభాగాల్లో మొదటి రెండు స్థానాలకు విజేతలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. మొదట స్థానంలో నిలిచిన వారు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెట్రాజ్ మేనేజర్ కాశీవిశ్వేశ్వరరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.


జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న జేసీ నిశాంతి

చెత్తబుట్టలు మూలకు చేర్చారండోయ్..!



గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఉంచేందుకు గత ప్రభుత్వం అందించిన చెత్త బుట్టలు ఇప్పటికీ పంపిణీ చేయని తీరు అమలాపురం మండలం సమనస గ్రామపంచాయతీలో నెలకొంది. ఎన్నికలు సమీపిస్తున్నాయనే కారణాలతో ఈ చెత్తబుట్టలను ఓ గదిలో మూలకు చేర్చారు. అయితే ఎన్నికలు పూర్తయి నాలుగు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ పంపిణీ చేయకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను వివరణ కోరగా త్వరలోనే పంపిణీ చేస్తామన్నారు.

- న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

మనసు పెడితే స్వర్ణాంధ్ర సాకారమే

వికసిత్ భారత్‌లో బాగంగా స్వర్ణాంధ్ర@2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు ప్రభుత్వం కార్యాచరణ చేట్టింది. 2047 నాటికి స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దడానికి 15 శాతం వృద్ధి రేటుతో ముందుకు సాగేలా అయిదేళ్ల ప్రణాళికలు రూపొందిస్తున్నారు. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ వ్యవసాయాధారితంగా ప్రజల జీవన విధానం సాగుతుంది. జిల్లాలో వ్యవసాయం, ఉద్యానం, ఆక్వా, పర్యాటకం, మానవ వనరుల అభివృద్ధి, పరిశ్రమల స్థాపన ద్వారా స్వర్ణాంధ్ర సాధన.. నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవచ్చు.

- న్యూస్‌టుడే, ముమ్మిడివరం

కోనసీమ.. ధాన్యాగారం

జిల్లాలో 1.74 లక్షల ఎకరాల వరి సాగు విస్తీర్ణం ఉంది. ఖరీఫ్, రబీ సీజన్‌లలో 9.15 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరుగుతోంది. ధాన్యాగారంగా బాసిల్లే జిల్లాలో పీడీఎస్ ద్వారా ఏటా 84 వేల మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తుండగా.. సుమారు 4.5 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఇతర ప్రాంతాలకు రవాణా అవుతోంది. పెరుగుతున్న పెట్టుబడులు, కూలీల కొరతను తట్టుకునేందుకు.. రైతులకు నేరుగా యాంత్ర పరికరాలు పంపిణీ చేయాలి.



డాలర్ల పంట.. ఆక్వా

రాష్ట్ర వృద్ధిరేటులో కీలక భూమిక పోషించే ఆక్వా సాగు వృద్ధిపై దృష్టి సారించాలి. జిల్లాలో 36 వేల ఎకరాల్లో అధికారికంగా.. మరో 6 వేల ఎకరాల్లో అనధికారికంగా ఆక్వాసాగు జరుగుతోంది. జిల్లాలో 65 వేల మంది ఆక్వా రైతులు, 1.5 లక్షల మంది మత్స్యకారులు ఉన్నారు. కాట్రేనికోన, ఉప్పలగుప్తం మండలాల్లోని తీర ప్రాంతంలో 14 వేల ఎకరాల్లో పీతల సాగు జరుగుతోంది. వెనామీ రొయ్యల సాగులో రొయ్య పిల్లల ఉత్పత్తి కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు, మేత ధరల తగ్గింపు, రొయ్యల ధరల స్థిరీకరణ వంటి వాటిపై దృష్టి సారించడం ద్వారా ఈ రంగం మరింత వృద్ధి సాధిస్తుంది. ఎంతో డిమాండు, మంచి ధర వచ్చే సాగుకు అక్కడ హేచరీ నెలకొల్పడం ద్వారా పీతల ఉత్పత్తి మరింత ఊపందుకుంటుంది.


ఆక్వా రొయ్యల పట్టుబడి

ఉద్యానానికి ఊతమిస్తే..

కోనసీమలో కొబ్బరి 42 వేల హెక్టార్లలో సాగవుతోంది. సుమారు రూ.500 కోట్లకు పైగా వ్యాపారం సాగుతోంది. జిల్లాలో సెంట్రల్ కోకోనట్ బోర్డు ఏర్పాటు చేయాలి. కొబ్బరి ఆధారిత పరిశ్రమలకు తోడ్పాటు అందించాలి. కోనసీమలో 1.60 లక్షల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా కొబ్బరి పరిశ్రమలపై ఆధారపడి జీవవిస్తున్నారు. అరటి, కోకో, వక్క, తమలపాకులు, మిరియం వంటి అంతర పంటల సాగుకు ప్రోత్సాహం అందించాల్సి ఉంది.

జిల్లా నేపథ్యం..

మండలాలు: 22	గ్రామాలు: 385
పట్టణాలు: 4 (మున్సిపాలిటీలు 3, 1 నగర పంచాయతీ)	
భౌగోళిక విస్తీర్ణం: 2081 చదరపు కిలోమీటర్లు	
అక్షరాస్యత రేటు: 79.17 శాతం	
జనాభా: 18.33 లక్షలు	
మొత్తం పంటల విస్తీర్ణం: 2.34 లక్షల హెక్టార్లు	

పరిశ్రమల స్థాపనపై దృష్టి సారిస్తే..

జిల్లా భౌగోళిక విస్తీర్ణం.. పరిశ్రమల స్థాపనకు ఎంతో అనువుగా ఉంటుంది. వ్యవసాయ, ఆక్వా ఆధారిత పరిశ్రమలతో పాటు.. ఇతర యూనిట్లు నెలకొల్పడానికి అవకాశం ఉంది. మెకనైజ్డ్ హేచరీస్, రొయ్యలు, మేత, పరీక్ష, ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పాల్సి ఉంది. జిల్లాలో మానవ వనరులకు కొదవ లేదు. అసంఘటిత రంగంలో సుమారు. . 10 లక్షలకు పైగా కార్మికులు ఉన్నారు. ఏటా 12 వేల మంది డిగ్రీ, ఇంజినీరింగ్ తదితర పట్టాలు తీసుకుని బయటకు వస్తున్నారు. జిల్లాలో 16 భారీ, మధ్య తరహా పరిశ్రమలు, 230 చిన్న తరహా పరిశ్రమలు ఉన్నాయి.

పొడగట్లపల్లిలో అన్నక్షేత్రం ప్రారంభం నేడు

రావులపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: రావులపాలెం మండలం పొడగట్లపల్లిలో హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో అన్నక్షేత్రాన్ని శనివారం ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ కేంద్రం ద్వారా జిల్లాలోని ఆసుపత్రుల్లో రోగులకు, ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు రోజూ మధ్యాహ్న భోజనం అందిస్తుండగా, గత కొద్ది నెలలుగా ఏడు అన్న క్యాంటీన్లకు సరఫరా చేస్తున్నారు. ఆహార పదార్థాలు వండేందుకు అవంతి సంస్థకు చెందిన డాక్టర్ అల్లూరి ఇంద్రకుమార్ విరాళమిచ్చిన రూ.1.2 కోట్లతో పొడగట్లపల్లిలో సామాజిక వంటశాల నిర్మించారు. మంగిపూడి కృష్ణశాస్త్రి, సీతమ్మ ట్రస్టు స్థలం సమకూర్చింది. జిల్లాలో క్యాంటీన్లకు నిత్యం 9 వేలకుపైగా భోజనాలు అందించనున్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు చర్యలు తీసుకున్నారు. అన్నక్షేత్రం ప్రారంభోత్సవానికి మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ హరీష్‌మాథుర్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ హాజరుకానున్నట్లు సంస్థ సభ్యులు తెలిపారు.


అన్నక్షేత్ర భవనం

ఇదెక్కడి చోద్యం

- కౌన్సిలర్లకు బదులుగా కుటుంబ సభ్యులు హాజరు
- వారితోనే సమావేశంలో చర్చించిన ఛైర్‌పర్సన్

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం పురపాలక సంఘ కార్యాలయం మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లో వైకాపా కౌన్సిలర్లు, కౌన్సిలర్ల భర్తలు, కుమారులతో మున్సిపల్ అధికారులు శుక్రవారం సమావేశం నిర్వహించారు. తమ వార్డు పరిధి, పట్టణంలో అభివృద్ధి పనులు, మున్సిపల్ కౌన్సిల్ సమావేశం తదితర వాటిపై చర్చించేందుకు దానిని ఏర్పాటు చేశారు. మహిళా కౌన్సిలర్లు రాకుండా వారి భర్తలు, కుమారులు పాల్గొనటంపై అధికారులు, స్థానికులు విమర్శిస్తున్నారు. అధికారంలో ఉన్న తెదేపా, జనసేన పార్టీ కౌన్సిలర్లను పిలవలేదని తెలిపారు. కనీసం తమ వార్డుల్లో సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు చెప్పడానికి కౌన్సిలర్లు రాలేరా అని అక్కడకు వచ్చిన వారు ప్రశ్నిస్తున్నారు. ఈ సమావేశం జరుగుతున్న సమయంలో పొట్టిశ్రీరాములు సర్క్యులర్ బజార్‌లో అద్దెకు ఉంటున్న దుకాణదారులు తమ అద్దె రెట్టింపు చేయడాన్ని నిరసిస్తూ వినతిపత్రం ఇవ్వడానికి అక్కడకు వచ్చారు. అయితే మున్సిపల్ ఛైర్‌పర్సన్ బయటకు వెళ్లి వినతి పత్రం తీసుకోవాలని పట్టణ వైకాపా అధ్యక్షుడు సంసాని చంద్రశేఖర్, కౌన్సిలర్లు ఆదేశించారు. అయినా ఆమె వినకపోవడంతో చంద్రశేఖర్ కోపంతో తలుపు నెట్టుకుంటూ వెళ్లిపోయారు. కౌన్సిలర్ల ఆదేశాల ప్రకారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బయటకు వచ్చి దుకాణాదారుల నుంచి వినతిపత్రం అందుకోవడం గమనార్హం. ఈ సందర్భంగా వారు మూడు సంవత్సరాలకు 33శాతం పెంచాలి కాని ఇలా చేయడం సబబుకాదని వేడుకున్నారు.


అమలాపురంలోని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లో సమావేశమైన వైకాపా కౌన్సిలర్లు, కౌన్సిలర్ల భర్తలు, అధికారులు

డీఎస్సీ ప్రకటనకు వేళాయే

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు కావాలనే ఆశయంతో బీఈడీ, డీఈడీ కోర్సులతో పాటు, తెలుగు, హిందీ పండిట్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు ఉపాధ్యాయ నియామక ప్రకటన వైకాపా ప్రభుత్వం 2024 సార్వత్రిక ఎన్నికల ముందు ఇచ్చినా ఫలితం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ నిర్వహిస్తామని చెప్పిన ప్రకారం సుమారు 16వేల పోస్టులతో నోటిఫికేషన్ విడుదల చేశారు. దీనిలో భాగంగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)-2024లు ఈనెల 3వ 25వతేదీ వరకు జరుగుతున్నాయి. నవంబరు 2వ తేదీన టెట్ ఫలితాలు విడుదల చేసి, 3న డీఎస్సీ ప్రకటన విడుదల చేసేందుకు విద్యాశాఖ సమాయాత్తం అవుతున్నట్లు అధికారులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

డీఎస్సీకి సిద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లాల పునర్విభజన అనంతరం మొదటి సారిగా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పర్యవేక్షణలో ఎంపిక చేసిన ప్రైవేటు శిక్షణా కేంద్రాల ద్వారా ఈ సామాజికవర్గ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వనున్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ఉపాధ్యాయ విద్యకు సంబంధించిన కోర్సులు పూర్తి చేసి, టెట్‌లో అర్హత సాధించిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు డీఎస్సీ ఉచిత శిక్షణ పొందేందుకు అర్హులు. శిక్షణ తీసుకునేందుకు ఆసక్తి ఉన్న వారు ఈనెల 21వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో జ్ఞానభూమి పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు. అభ్యర్థులు jnanabhumi.ap.gov.in లో వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 27న ఆన్‌లైన్‌లో స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో వచ్చిన మార్కులకు 85 శాతం, టెట్‌లో వచ్చిన మార్కులకు 15 శాతం వెయిటేజీ ఇచ్చి అభ్యర్థులను ఎంపిక చేస్తారు.


బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో టెట్ పరీక్ష రాయడానికి వస్తున్న అభ్యర్థులు

సద్వినియోగం చేసుకోవాలి

డీఎస్సీ పరీక్షకు సిద్ధమయ్యే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఇది మంచి అవకాశం. ఎంపికైన వారికి 3నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. అభ్యర్థుల వార్షిక ఆదాయం రూ.2.50లక్షలు మించకూడదు. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి. జిల్లాలో 5వేల నుంచి 6వేల దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నాం.

- జ్యోతిలక్ష్మీ దేవి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి

వాడపల్లి బ్రహ్మోత్సవాలకు మంత్రికి ఆహ్వానం

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరాలయంలో ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని దేవస్థానం ఈవో (డీసీ) నల్లం సూర్యచక్రధరరావు ఆహ్వానించారు. అమరావతిలోని మంత్రి కార్యాలయంలో ఆయన్ను శుక్రవారం కలిసి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక అందజేశారు. వేదాశీర్వాదంతో స్వామివారి శేషవస్త్రం కప్పి తీర్థప్రసాదాలు అందజేశారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు ఇబ్బందులు పడకుండా చేస్తున్న ఏర్పాట్లను మంత్రికి వివరించారు.


మంత్రి రామనారాయణరెడ్డికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

ప్రయాణం.. నరకప్రాయం

కొత్తపేట మండలం పలివెల మీదుగా గంటి వెళ్లే ప్రధాన రోడ్డు మొత్తం గుంతలతో అధ్వానంగా మారింది. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరుచేరి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గం మీదుగా నిత్యం వందల సంఖ్యలో ద్విచక్రవాహనాలు, ఆటోలు, పాఠశాల బస్సులు వెళుతుంటాయి. వెన్నెముక సమస్యలు వస్తున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. గర్భిణులు ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. అధికారులు స్పందించి మరమ్మతు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కొత్తపేట



శ్మశానవాటికకు దారి లేదాయె..?

కాట్రేనికోన పంచాయతీ పరిధి రామస్వామితోటలో శ్మశానవాటికకు వెళ్లే మార్గం మొత్తం నీటితో నిండి, బురదమయంగా మారడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓల్డ్ ఆయిల్‌పూరం డ్రెయిన్ గట్టు శ్మశానవాటికకు ఉంది. ఇక్కడకు వెళ్లే 120 మీటర్ల దూరమున్న రోడ్డును సుమారు పదిహేనేళ్ల క్రితం నిర్మించారు. రోడ్డంతా పల్లమై వర్షాలకు నీరు నిలిచి చెరువులా మారింది. ఈ నీరు రోజుల తరబడి నిలిచిపోవడంతో ఎవరైనా చనిపోయినప్పుడు తీసుకువెళ్లేందుకు మృతుల బంధువులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన ఓ వృద్ధుడు మృతిచెందగా బురద, మోకాలిలోతు ముంపునీటిలో శ్మశానవాటికకు తీసుకువెళ్లేందుకు బంధువులు, స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

- న్యూస్‌టుడే, కాట్రేనికోన



సాగునీటి విడుదల

ధవళేశ్వరం: ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి శుక్రవారం 7,100 క్యూసెక్కుల సాగు నీటిని విడుదల చేశామని జలవనరులశాఖ అధికారులు తెలిపారు. తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలకు 1300, 1800, 4000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 10.90 అడుగుల నీటిమట్టం కొనసాగుతుందన్నారు. 55,862 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.

ఐటీఐలు.. నైపుణ్య కేంద్రాలు

గత ఐదేళ్లతో పోలిస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల కాలంలోనే ఐటీఐలకు డిమాండ్ పెరిగింది. గతంలో ప్రభుత్వ ఐటీఐల్లో సైతం సీట్లు భర్తీ కాకపోగా ప్రైవేటులో 50-60 శాతం మాత్రమే భర్తీ అయ్యేవి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యమివ్వడంతో వీటిల్లో చేరే వారిసంఖ్య గణనీయంగా పెరిగింది. దీనికితోడు నూతన కోర్సులను ప్రవేశపెట్టేందుకు అడుగులు వేస్తుండటంతో ఉపాధి కేంద్రాలుగా మార్చాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం నెరవేరనుంది.

- న్యూస్‌టుడే, గాంధీనగర్

ఆధునిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం, ఉద్యోగ కల్పన విభాగం ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించడం మొదలుపెట్టారు. దీంతో ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో ఐటీఐల్లో చదివిన విద్యార్థులు 75 శాతం మందికి ఎల్‌అండ్‌టీ బెంగళూరు, చెన్నై, ఐటీసీ, నూకాన్ ఏరోస్పేస్ వంటి ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయి. మిగిలిన 25 శాతం మందిలో కొందరు బ్రిడ్జ్‌కోర్సు ద్వారా పాలిటెక్నిక్‌లో చేరగా, మరికొందరు ప్రభుత్వ కంపెనీల్లో అప్రెంటిస్ కోసం వెళ్లారు. మరికొందరు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వివరాలిలా..

జిల్లా	ఐటీఐలు	సీట్లు	భర్తీ శాతం
కాకినాడ	ప్రభుత్వ-2	684	99.4
	ప్రయివేట్-12	1448	85
కోనసీమ	ప్రయివేట్-15	2236	80
తూర్పుగోదావరి	ప్రయివేట్-12	1340	86
	ప్రభుత్వ-1	132	100


టర్నర్ ట్రేడ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

నూతన కోర్సులకు శ్రీకారం

కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో 13 కోర్సుల్లో 1,048 మంది శిక్షణ పొందుతున్నారు. వీటిలో రెండు సంవత్సరాల కోర్సులు 9, ఏడాది కోర్సులు 4 ఉన్నాయి. ప్రైవేట్ ఐటీఐల్లో సుమారు ఆరు కోర్సులను నిర్వహిస్తున్నారు. కొత్తగా డ్రోన్ టెక్నాలజీ, సోలార్ ఎలక్ట్రీషియన్ కోర్సులను రెండు మూడు నెలల్లో ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుతం వీటికి డిమాండ్ ఉండటంతో వీటి ద్వారా మరింత మంది నిపుణులను అందుబాటులో తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంది. సీట్ల ప్రకటన త్వరలో ప్రకటించనున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రూ.1.93 కోట్లతో స్ట్రైవ్ ప్రాజెక్టు ద్వారా ట్రేడ్ అప్‌గ్రేడేషన్, మౌలిక వసతుల కల్పనకు నిధులు ఖర్చు చేస్తున్నారు. వీటితో కంపెనీలకు కావాల్సిన విధంగా యంత్ర సామగ్రి కొనుగోలు చేసి శిక్షణ ఇస్తున్నారు. దీనికితోడు ఏపీఎస్ఎస్‌డీసీ వారి స్కిల్‌హబ్ ద్వారా మల్టీస్కిల్‌లో భాగంగా మరొక ట్రేడ్‌లో మూడు నెలల శిక్షణ ఇస్తున్నారు. తద్వారా రెగ్యులర్‌తో పాటు స్వల్పకాలిక కోర్సు ద్వారా మరిన్ని నైపుణ్యాలు పెంచుకునేలా చేస్తున్నారు.

పరిశ్రమలతో అనుసంధానం..

నూతన విధానంలో భాగంగా విద్యార్థులకు స్థానిక కంపెనీలతో శిక్షణ ఇచ్చేలా చేస్తున్నారు. కాకినాడ ప్రభుత్వ ఐటీఐలోని ల్యాబ్‌లలో సౌకర్యాలు, యంత్రాలు సమకూరుస్తున్నారు. కోరమాండల్ కంపెనీ ఇన్‌స్ట్రుమెంట్ మెకానికల్ ల్యాబ్‌ను, వరుణ్ మోటార్స్ వారు మోటార్, డీజిల్ మెకానిక్‌లో ఎంవోయూ చేసుకొని శిక్షణ అందిస్తున్నారు.

ఉపాధి అవకాశాలు మెండు...

ఐటీఐ పూర్తిచేస్తే ఉపాధి అవకాశాలు బాగున్నాయి. ప్రభుత్వం నైపుణ్యత, ఉద్యోగిత లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో గతంలో కంటే ఈ ఏడాది ప్రవేశాల సంఖ్య పెరిగింది. రెగ్యులర్ కోర్సులతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్‌కు ప్రాధాన్యమిస్తుండటం, పరిశ్రమలతో ఎంవోయూలు కుదుర్చుకోవడం ద్వారా మెరుగైన నైపుణ్యాలను నేర్పించగలుగుతున్నాం.

- మంతెన వేణుగోపాలవర్మ, కాకినాడ, కోనసీమ జిల్లాల కన్వీనర్

మహిళల అభ్యున్నతికి కృషి చేయాలి

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: మహిళల సామాజిక, ఆర్థిక సాధికారిత, చిన్నారుల సంరక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మహిళలకు, చిన్నారులకు అందుతున్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అవసరమైన వసతులు కల్పించాలన్నారు. జిల్లాలో ఉన్న కేంద్రాల్లో ఎంపిక చేసిన 340 అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్స్ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వీటి పెంపకానికి అవసరమైన విత్తనాలు, జీవ ఎరువులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. 101 కేంద్రాల్లో ప్రారంభించిన మరుగుదొడ్ల నిర్మాణాలను నవంబర్ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. 248 కేంద్రాల్లో తాగు నీటి వసతులు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఝాన్సీరాణి, డీఆర్‌డీఏ పీడీ శివ శంకర ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

రహదారి పనులు వేగవంతం...

జాతీయ రహదారి 216, కోటిపల్లి- నరసాపురం రైల్వే లైన్ ఏర్పాటులో ఉత్పన్నమయ్యే సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైలు, రోడ్డు మార్గాల్లో భూములు కోల్పోయిన నిర్వాసితుల అభ్యంతరాలను సామరస్య పూర్వకంగా పరిష్కరించాలన్నారు. శివకోడు లాకులు దెబ్బతినకుండా ఉండేలా ఎలైన్‌మెంట్ మార్పు చేయాలని అధికారులకు సూచించారు. కోటిపల్లి నుంచి భట్నవిల్లి వరకు సేకరించిన భూములను రైల్వే అధికారులకు అప్పగించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ నిశాంతి, ఆర్డీవోలు కె.మాధవి, శ్రీకర్, ఖతీబ్ కౌసర్‌బానో ఇతర అధికారులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.2,02,232 విరాళం

అయినవిల్లి న్యూస్‌టుడే: సిద్ధివినాయక స్వామి ఆలయంలో అన్నదాన ట్రస్టుకు కాకినాడకు చెందిన నల్లం పరశురామ్ కుటుంబ సభ్యులు వారి తల్లిదండ్రులు నల్లం బాలకృష్ణారావు పేరున రూ.1,01,116, లక్ష్మీనరసమ్మ పేరున రూ.1,01,116 విరాళాన్ని ఈవో సత్యనారాయణ రాజుకు శుక్రవారం అందజేశారు. వారికి ఈవో స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.



శతాధిక వృద్ధురాలి మృతి



ఉప్పలగుప్తం: గొల్లవిల్లికి చెందిన శతాధిక వృద్ధురాలు బీరమేను సత్తెమ్మ(115) శుక్రవారం వయోభారంతో మృతి చెందారు. ఆమెకు అయిదుగురు కుమార్తెలు, ఇరువురు కుమారులు ఉన్నారు. 25 మంది మనుమలు, మనవరాండ్రు, 30 మంది మునిమనుమలు ఉన్నారు. వృద్ధాప్యంలోను ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేకుండా ఆమె తిరిగేవారని కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రోత్సహిస్తే మరిన్ని పతకాలు

దేవీచౌక్(రాజమహేంద్రవరం): ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే మరిన్ని పతకాలు సాధిస్తానని 2024 బయాథ్లే/ట్రైథల్లే వరల్డ్ ఛాంపియన్ షిప్‌లో కాంస్య పతకం సాధించిన భారత జట్టులో సభ్యుడు వరద మణికంఠ నవీన్ తెలిపాడు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ యానాంలోని నల్లం హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న తాను అక్కడే ఉన్న ఓ అకాడమీలో స్విమ్మింగ్, రన్నింగ్, షూటింగ్‌లో శిక్షణ పొందానని వెల్లడించాడు. కోచ్ గ్రంధి రవితేజ ప్రోత్సాహంతో ఈజిప్టులోని పోర్టు సైడ్‌లో ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు జరిగిన యూఐపీఎం 2024 బయాథ్లే/ట్రైథల్లే వరల్డ్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొని అండర్-17 కేటగిరిలో తమ జట్టు కాంస్య పతకం సాధించడానికి దోహదపడ్డానన్నాడు. త్వరలో జరగబోయే ఏషియన్ గేమ్స్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనాలనేది తన కోరికని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందించాలని కోరాడు. ఈ సమావేశంలో నవీన్ తల్లిదండ్రులు ఈశ్వరరావు, హారిక పాల్గొన్నారు.


మణికంఠ నవీన్

అట్టహాసంగా స్కేటింగ్ పోటీలు ప్రారంభం


స్కేటింగ్ చేస్తున్న క్రీడాకారులు

మసీదుసెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: క్రీడాకారులు ఆత్మవిశ్వాసంతో పోటీల్లో పాల్గొనాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. విద్యాశాఖ, క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 68వ అంతర జిల్లాల రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు కాకినాడలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. కలెక్టర్, కాకినాడ గ్రామీణం ఎమ్మెల్యే పంతం నానాజీతో కలిసి కార్యక్రమం ప్రారంభించారు. డీఈవో పి రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ అండర్-11, 14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు జరుగుతున్నాయన్నారు. 13 ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 400 మంది పాల్గొన్నారన్నారు. ఉత్తమ ప్రదర్శనతో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. హరీష్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ తలాటం హరీష్, డీఎస్‌ఏ డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 జిల్లా కార్యదర్శి లంకా జార్జి, జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కోశాధికారి సీహెచ్ రమేష్, జిల్లా పీఈటీ అసిసోయేషన్ అధ్యక్షకార్యదర్శులు వి.రవిరాజు, కె.నూకరాజు, పీఈటీలు రవిసుందర్, కౌర్, సుధాకర్, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంతర్ జిల్లా రైఫిల్ షూటింగ్ పోటీలు

రాజానగరం, న్యూస్‌టుడే: రాజానగరం మండలంలోని సంపతనగరంలో గల రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్)ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ పోటీలు నిర్వహించనున్నామని ఎస్‌జీఎఫ్ తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి శుక్రవారం తెలిపారు. పాఠశాల ఛైర్మన్ టి.కె. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి సుమారు వెయ్యి మంది విద్యార్థులు ఈ పోటీలకు హాజరుకానున్నారని తెలిపారు. వారందరికీ అవసరమైన వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. శనివారం ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, డిఐఎస్‌ఈఓ వాసుదేవరావు తదితరులు పాల్గొంటారన్నారు.


రైఫిల్ షూటింగ్‌లో సాధన


ప్రాణాలు తీసిన రిఫ్రిజిరేటర్
వేర్వేరు ఘటనల్లో ఇద్దరు దుర్మరణం

ఉప్పలగుప్తం, న్యూస్‌టుడే: అత్తవారి ఇంటికి అతిథిగా వచ్చి ఫ్రిజ్‌ను శుభ్రం చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన సంఘటన ఉప్పలగుప్తం మండలం వాసాలతిప్ప గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పి.గన్నవరం మండలం మొండెపులంకకు చెందిన కొప్పాడి నాగరాజు(29) ఈ నెల 15న అత్తవారి ఇంటికి గృహప్రవేశం నిమిత్తం ఉప్పలగుప్తం మండం చల్లపల్లి పంచాయతీ వాసాలతిప్ప గ్రామానికి వచ్చారు. గురువారం సాయంత్రం ఇంటిలోని ఫ్రిజ్‌ను క్లీన్ చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం అమలాపురం ఆసుపత్రికి తరలిస్తుండగా దారిలో మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ శుక్రవారం తెలిపారు. నాగరాజుకు ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. భార్య జయలక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇంతవరకూ కూలిపనులు, వేట సాగిస్తూ కుటుంబాన్ని నెట్టు కొచ్చాడు. నాగరాజు మృతితో కుంటుంబం ఏకైక జీవనాధారం కోల్పోయింది. పిల్లలు చిన్నవారు కావడంతో వారి భవిష్యత్తుపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు.


నాగరాజు (పాత చిత్రం)

బాగు చేస్తుండగా...

ముమ్మిడివరం: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతం సంభవించి వ్యక్తి మృతి చెందిన సంఘటన ముమ్మిడివరంలోని ఠాణేల్లంకలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం ఠాణేల్లంకకు చెందిన సుందరపల్లి నాగ వెంకట శేషాద్రి(50) శుక్రవారం తన ఇంటిలో రిఫ్రిజిరేటర్ మరమ్మతు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే ముమ్మిడివరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారన్నారు. మృతునికి భార్య ఆదిలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై జ్వాలా సాగర్ తెలిపారు.


నాగవెంకట శేషాద్రి (పాత చిత్రం)

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	11,500
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	13,000-13,500
కొత్త (పచ్చి) కాయ	12,500-13,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	130-00
రిటైల్ లైవ్	152-00
డ్రెస్డ్	220-00
స్కిన్‌లెస్	251-00

ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఎప్పుడో..!

రామచంద్రపురం: ప్రభుత్వ జూనియర్‌తో పాటు డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకులను రెగ్యులర్ చేస్తామని చెప్పిన నాటి వైకాపా ప్రభుత్వం గత సెప్టెంబరు 23న 114 జీవో తీసుకొచ్చింది. ఏ ఒక్కరిని పర్మినెంట్ చేయలేకపోయారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న 47 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 367 మంది ఒప్పంద అధ్యాపకులు పనిచేస్తున్నారు. 2000 సంవత్సరంలో అప్పటి, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వలనే తామంతా ఇప్పటికీ ఉద్యోగాలు చేసుకుంటున్నామని, ఆయనే తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించి జీవితాల్లో వెలుగు నింపాలని కోరుతున్నారు.

దశలవారీగా శాంతియుత పోరాటం

జీవో ఎంఎస్ నెం. 114, 23-09-2023 ప్రకారం తమను క్రమబద్ధీకరించాలని కోరుతూ ఒప్పంద అధ్యాపకులు దశలవారీగా శాంతియుత పోరాటాన్ని ప్రారంభించారు. ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకు పసుపు రిబ్బన్లతో విధులకు హాజరవుతున్నారు. 20న కాకినాడ జిల్లా పిఠాపురం పురుహూతిక అమ్మవారి ఆలయంలో గణపతి హోమం చేపట్టారు. 28వ తేదీ నుంచి 2వ తేదీ వరకు ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీఐఈవోలు, ఆర్జేడీలకు, డీవీఈవోలకు వినతిపత్రాలు అందజేస్తారు.


రిబ్బన్లతో విధులకు హాజరైన ఒప్పంద అధ్యాపకులు

బాలికపై అసభ్య ప్రవర్తన.. పోలీసులకు ఫిర్యాదు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు లేని సమయంలో బాలికపై ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించడంతో అతడిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం కాట్రేనికోన పోలీసుస్టేషనులో ఫిర్యాదు అందింది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలికపై ఆమె తల్లిదండ్రులు లేని సమయంలో స్థానిక వ్యక్తి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడని, మరునాడు రాత్రివేళ ఇంటి తలుపులు కొట్టి భయభ్రాంతులకు గురిచేశాడన్నారు. సదరు బాలిక ఇదే విషయాన్ని తన తల్లిదండ్రులు వచ్చిన వెంటనే తెలియజేయగా అసభ్యంగా ప్రవర్తించి, వేధింపులకు గురిచేస్తున్న అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్టేషనులో ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై ఎస్సై అవినాష్‌ను అడుగగా వారిని పిలిపించి మాట్లాడతామన్నారు.

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

ఉద్యోగాలకు ఎంపిక

కొత్తపేట: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో స్థానిక విశ్వకవి వేమన డిగ్రీ కళాశాలలో శుక్రవారం మినీ జాబ్ మేళా నిర్వహించారు. 21 మంది హాజరుకాగా వివిధ కంపెనీలకు పది మంది అభ్యర్థులు ఉద్యోగం సాధించారు. 16 మంది తదుపరి ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డి.హరిశేషుబాబు, ప్రిన్సిపల్ కె.పి.రాజు, రాజ్‌కుమార్, కె.రాజేంద్రప్రసాద్, జ్యోత్స్న, వివిధ కంపెనీల హెచ్‌ఆర్‌లు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్ట్‌కు రూ.60 వేల విరాళం

అయినవిల్లి, న్యూస్‌టుడే: సిద్ధివినాయకస్వామి ఆలయంలో అన్నదాన ట్రస్ట్‌కు శుక్రవారం రాజమహేంద్రవరానికి చెందిన మంగళంపల్లి శ్రీనివాస సుబ్రహ్మణ్య సంగమేశ్వరశర్మ కుటుంబ సభ్యులు రూ.60 వేలు విరాళాన్ని ఈవో సత్యనారాయణరాజుకు అందజేశారు. వారికి ఈవో స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు.

సైఫన్ నిర్మాణానికి ఎమ్మెల్యే కృషి

కొత్తపేట, న్యూస్‌టుడే: బ్యాంక్ కెనాల్ వెంబడి ఉన్న పొలాలు ముంపు బారిన పడకుండా సైఫన్ నిర్మాణానికి రూ. 2.92 కోట్ల నిధులు మంజూరుకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కృషి చేశారని తెదేపా నాయకులు కంఠంశెట్టి శ్రీనివాసరావు, ముత్యాలబాబ్జి, రెడ్డి తాతాజీ, బండారు వీరబాబు, పల్లి యేసు తెలిపారు. శుక్రవారం కొత్తపేటలో వారు మాట్లాడుతూ లొల్ల లాకుల ఆధునికీకరణకు త్వరలో నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వం అయిదేళ్లలో రహదారులు, డ్రెయిన్లను పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం పల్లె పండగ పేరుతో రహదారులు, మురుగు కాలువల పనులను వేగవంతం చేశారన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

డ్రెయినేజీ శుభ్రం

రావులపాలెం పట్టణం: స్థానిక ఇందిరాకాలనీలో డ్రెయిన్ పూడిక పోవడంతో మురుగునీరు ముందుకు పారక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎల్.దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించి, సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు.

చెత్త తొలగింపు

ఆత్రేయపురం: వెలిచేరులో పలుచోట్ల చెత్త పేరుకుపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను సర్పంచి వేములు శ్రీనివాస్ వద్ద ప్రస్తావించగా స్పందించి శుభ్రం చేయించారు.

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174
పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట:90323 93884

కాలనీకి దూరంగా విద్యుత్తు పరివర్తకం

మామిడికుదురు మండలం మొగలికుదురు ఎస్సీ కాలనీలో ఇళ్ల పక్కనే విద్యుత్తు పరివర్తకాన్ని ఏర్పాటు చేయడం వల్ల అక్కడి కుటుంబాలు భయాందోళన వ్యక్తం చేయడంపై గత నెల 26న 'ఈనాడు'లో 'కాలనీకి వెళ్లాలంటే..' శీర్షిక ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. దీనిపై సత్వర కార్యాచరణ చేపట్టాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అధికారులకు సూచించడంతో వెంటనే చర్యలకు ఉపక్రమించి సమస్యను పరిష్కరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సచివాలయంపై తొలగిన బోర్డు..

నగరం గ్రామ సచివాలయం-2 కార్యాలయ భవనంపై ఉన్న గత వైకాపా ప్రభుత్వానికి చెందిన నవరత్నాల బోర్డును అధికారులు తొలగించారు. 'బోర్డు తీయరు.. ఇదేం తీరు' శీర్షిక శుక్రవారం ప్రచురితమైన కథనానికి వెంటనే స్పందించి చర్యలు చేపట్టారు. – న్యూస్‌టుడే, మామిడికుదురు

మహిళలకు ఉపాధి... ఆర్థిక స్వావలంబన

న్యూస్‌టుడే – మామిడికుదురు

స్థానిక ఉత్పత్తులకు ఆన్‌లైన్ మార్కెటింగ్

డ్వాక్రా సంఘాలకు ప్రభుత్వం స్త్రీనిధి, ఉన్నతి, సామాజిక పెట్టుబడి నిధి తదితర పథకాలు, బ్యాంకుల నుంచి రూ.కోట్లలో రుణ సౌకర్యాలు కల్పిస్తోంది. వీటి ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలు వివిధ యూనిట్లు ఏర్పాటు చేసి ఉపాధి పొందుతున్నాయి. స్థానిక వనరులను ఉపయోగించుకుని వైవిధ్యమైన ఉత్పత్తులను రూపొందిస్తున్నాయి. ఆశించినంతగా మార్కెటింగ్ సౌకర్యాలు లేకపోవడంతో ఆదరణ అంతంత మాత్రంగానే ఉంటోంది. ఇక్కడి ఉత్పత్తులకు సరైన ప్రచారం లేకపోవడం వల్ల శ్రమకు తగిన ఫలితం కనిపించడం లేదు. డిజిటల్ కామర్స్ మార్కెటింగ్ ద్వారా వారికి పూర్తి స్థాయిలో చేయూతనిచ్చేందుకు కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఆ దిశగా ఓఎన్‌డీసీ ద్వారా కార్యాచరణ, వారిలో చైతన్యం తెచ్చేందుకు డీఆర్‌డీఏ అవగాహన కల్పిస్తోంది.


రాజోలులో జనపనారతో రూపొందించిన సంచి

స్వయం ఉపాధికి డిజిటల్ ప్రోత్సాహం

రాజోలు నియోజకవర్గంలోని రాజోలు, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో 6,748 డ్వాక్రా సంఘాలున్నాయి. ఇందులో సుమారు 74,228 మంది సభ్యులున్నారు. ఈ ప్రాంతంలో పలు రకాల పచ్చళ్లు, చెగోడీలు, జీడిపప్పు అచ్చులు, గ్రాజులు, కాస్తాలు తయారు చేస్తూ అనేక కుటుంబాలు వారు ఉపాధి పొందుతున్నారు. కొబ్బరి పీచు, జనపనారతో పలు రకాల బొమ్మలు, గోదినీలు, తాళ్లు, సంచులు తయారు చేస్తున్నారు. ఇక్కడ రూపొందుతున్న ఉత్పత్తులు స్థానిక విక్రయాలకే పరిమితమవుతున్నాయి. డిజిటల్ మార్కెటింగ్ ద్వారా వారికి అన్నివిధాలా చేయూతనిచ్చే దిశగా డీఆర్‌డీఏ కృషి చేస్తోంది. గ్రామాల్లో డ్వాక్రా సంఘాలకు సంబంధించిన యానిమేటర్ల ద్వారా పూర్తి స్థాయిలో వివరాలు సేకరించి సమగ్రంగా నివేదిక రూపొందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో రూపొందించే ఉత్పత్తులకు ఓఎన్‌డీసీ (ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్) ద్వారా విక్రయాలకు అవకాశం కల్పిస్తారు. యానిమేటర్లు గ్రామాల్లో గుర్తించిన ప్రతి ఉత్పత్తిని ఇందులో ప్రదర్శించడం వల్ల మార్కెటింగ్ అవకాశాలు మెరుగుపడతాయి. ఆయా యూనిట్ల నిర్వాహకులకు ఉపాధి అవకాశాలు, ఆదాయాలు పెరిగి ఆర్థిక స్వావలంబన దిశగా తీర్చిదిద్దేందుకు కృషి జరుగుతోంది.


పీచుతో రూపొందించిన గోదిని


మామిడికుదురులో డిజిటల్ కామర్స్‌పై అవగాహన సదస్సులో మహిళలు

అవగాహన పెంచేందుకు కార్యాచరణ

డ్వాక్రా సంఘాలు తయారు చేసే అన్ని ఉత్పత్తులకు ఓఎన్‌డీసీ ద్వారా మార్కెటింగ్ అవకాశాలను కల్పించి ప్రోత్సహించేందుకు కార్యాచరణ జరుగుతోంది. దీనిపై మండలాల వారీగా యానిమేటర్లకు పూర్తి అవగాహన కల్పిస్తున్నాం. ఆయా ఉత్పత్తులను గుర్తించి వాటి ధరలతో సహా అందులో ప్రదర్శిస్తున్నాం. గ్రామాల్లో స్వయం ఉపాధికి మరిన్ని అవకాశాలపై పరిశీలన చేస్తున్నాం. వీటివల్ల స్థానికంగా తయారయ్యే ప్రతి ఉత్పత్తికి ఆదరణ పెరిగి మంచి ధర వస్తుంది. – అడబాల గణేశ్, డీపీఎం, డీఆర్‌డీఏ

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

రావులపాలెం పట్టణం: భూసర్వేకు సంబంధించి సమస్యలపై శనివారం రావులపాలెం మండలంలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు ముక్తేశ్వరరావు తెలిపారు. 19న ఈతకోట, 21న ముమ్మిడివరప్పాడు, 22న వెదిరేశ్వరం, 23న కొమరాజులంక, 24న లక్ష్మీపోలవరం, 25న దేవరపల్లి, 26న జుత్తుగపాడు, 28న ఊబలంక, 29న రావులపాలెం, 30న గోపాలపురంలో సభలు నిర్వహిస్తామన్నారు.

అంబాజీపేట: భూ సమస్యల పరిష్కారానికి 19 నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దారు జి.వెంకటేశ్వరి తెలిపారు. 19న ముక్కామల, 21న పసుపల్లి, 22న వక్కలంక, 23న మొసళ్లపల్లి పంచాయతీల పరిధిలో గ్రామ సభలు జరుగుతాయన్నారు. రీసర్వేలో ఏమైనా తేడాలు, అభ్యంతరాలుంటే దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

పి.గన్నవరం: భూముల రీసర్వేపై కారుపల్లిపాడులో శనివారం ఉదయం 10 గంటలకు రెవెన్యూ గ్రామసభ నిర్వహిస్తామని తహసీల్దార్ పి.శ్రీపల్లవి తెలిపారు. అభ్యంతరాలు ఉంటే రైతులు గ్రామసభ దృష్టికి తీసుకురావాలన్నారు. వీటిని 15 రోజుల్లో పరిష్కరిస్తామన్నారు.

27 నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ

రావులపాలెం పట్టణం, న్యూస్‌టుడే: రావులపాలెంలోని శ్రీసత్యసాయి సేవా మందిరంలో ఈనెల 27 నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సంస్థ కన్వీనర్ మన్యం పర్వతవర్ధనరావు తెలిపారు. ఆసక్తిగల నిరుద్యోగులు సంస్థ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఊబలంక విద్యార్థుల ఎంపిక

రావులపాలెం గ్రామీణం: రాజమహేంద్రవరంలో జరిగిన జిల్లా స్థాయి అండర్-14, 17 బాలబాలికల హాకీ, క్రికెట్, వాలీబాల్ పోటీల్లో ఊబలంక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయుడు రామారావు, విద్యార్థులను సర్పంచి లక్ష్మి, విద్యాకమిటీ ఛైర్మన్ మేడపాటి సురేశ్వరరెడ్డి, గ్రామస్థులు అభినందించారు.


ఎంపికైన విద్యార్థులతో విద్యా కమిటీ ఛైర్మన్ తదితరులు

బాలికకు ఆర్థిక సహాయం

సఖినేటిపల్లి: గొంది గ్రామంలో గత నెల విద్యుత్తు ప్రమాదానికి గురై ఒక చేతిని కోల్పోయి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న బర్రె దుర్గాభవానికి గల్ఫ్ శెట్టి బలిజ యువశక్తి సేవా సంస్థ రూ.50 వేలు ఆర్థిక సహాయన్ని శుక్రవారం అందజేసింది. సర్పంచి రవికుమార్, నెడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్ పాటి శివకుమార్, మత్స్యకార సంఘం అధ్యక్షుడు కొల్లు రాము, దిండి సర్పంచి శ్రీనివాసరాజు, సంస్థ కోశాధికారి దొంగ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీచక్రమహామేరు అమ్మవారికి పూజలు


మందపల్లిలో అలంకరించిన అమ్మవారు

కొత్తపేట, న్యూస్‌టుడే: మందపల్లిలో ప్రణవానంద స్వామి ప్రతిష్ఠించిన శ్రీచక్రమహామేరులలితా మహాత్రిపుర సుందరి రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారికి విశేష అలంకరణతో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిత్యం అధిక సంఖ్యలో భక్తులు కుంకుమ పూజలు, పంచామృత అభిషేకాలు చేస్తుంటారు. భక్తులు 12 నెలల పాటు పౌర్ణమి తిథుల్లో నవావరణ పూజలు జరిపిస్తుంటారు.

వెండి ఆభరణాల బహూకరణ



అంబాజీపేట, న్యూస్‌టుడే: స్థానిక శ్రీనివాసనగర్‌లోని శ్రీవిజయ బేతాళస్వామికి దాతలు కుడుపూడి రామ్మోహనరావు, అనంతలక్ష్మి దంపతులు రూ.60 వేల విలువైన వెండి శఠగోపం, వెండి పళ్లెంను బహూకరించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రత్యేక పూజలు చేసి ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

అంబరాన్నంటిన సంబరం

ఉత్సాహంగా విజయ బేతాళస్వామి ఉత్సవాలు

అంబాజీపేట, న్యూస్‌టుడే: విజయబేతాళస్వామి వాహన మహోత్సవం శుక్రవారం రాత్రి కనులపండువగా సాగింది. అంబాజీపేట, మాచవరం శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సంబరాలు అట్టహాసంగా సాగాయి. గరగనృత్యాలు, కోబ్రా, శక్తివేషాలు ఆకట్టుకున్నాయి. పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కొత్తపేట డీఎస్పీ వై.గోవిందరావు ఆధ్వర్యంలో పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు పర్యవేక్షణలో ఎస్సై కె.చిరంజీవి బందోబస్తు ఏర్పాటు చేశారు. బేతాళస్వామిని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, సర్పంచి శాంతకుమారి తదితరులు దర్శించుకున్నారు.


గరుత్మంతుడి వాహనం


అంబాజీపేటలో విజయభేతాళస్వామి


మాచవరంలో విజయకనకదుర్గమ్మ

రాజోలు ఎంపీడీవోగా రాంబాబు



రాజోలు, న్యూస్‌టుడే: రాజోలు ఎంపీడీవోగా డి.రాంబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాజమండ్రి నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎం.బాలాజీ మలికిపురం బదిలీ అయ్యారు. రాంబాబు మాట్లాడుతూ అందరి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సూపరింటెండెంట్ సత్యనారాయణ, కార్యాలయ సిబ్బంది ఆయన్ని అభినందించారు.

ఈవోపీఆర్డీగా భీమారావు

అంబాజీపేట: మండల ఈవోపీఆర్డీగా జి.భీమారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాజోలు నుంచి ఆయన వచ్చారు. ఈవోపీఆర్డీ మమత కాట్రేనికోన మండలానికి బదిలీపై వెళ్లినట్లు ఎంపీడీవో జి.సరోవర్ తెలిపారు.


సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు

అధ్యాపకులకు సంఘీభావం


మలికిపురం, న్యూస్‌టుడే: జీతాల కోసం 37 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న మలికిపురం ఎమ్వీఎన్, జేఎస్ అండ్ ఆర్వీఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు శాసనమండలిలో ప్రభుత్వ మాజీ విప్ రుద్రరాజు పద్మరాజు శుక్రవారం సంఘీభావం తెలిపారు. పాలకవర్గం వెంటనే అధ్యాపకులతో మాట్లాడి జీతాలు ఇచ్చి సమస్యను పరిష్కరించాలని కోరారు.

సహకార సంఘ ఉద్యోగుల ధర్నా


రాజోలు డీసీసీ బ్యాంక్ వద్ద ఉద్యోగుల నినాదాలు

రాజోలు: రాజోలు డీసీసీ బ్యాంక్ వద్ద మండలంలోని సహకార సంఘాల ఉద్యోగులు శుక్రవారం ధర్నా చేశారు. హెచ్ ఆర్ పాలసీని వెంటనే అమలు చేయాలని, సర్క్యులర్‌లో ఇచ్చిన డీఏ అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2019 తర్వాత చేరిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. సహకార సంఘాల ద్వారా రైతులకు 7 శాతం వడ్డీపై పంట రుణాలు ఇప్పించాలన్నారు. ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని నినాదాలు చేశారు. బండారు భాస్కరరావు, కల్వకొలను ఏడుకొండలు, డీకే రాజు, పి.నాగరాజు, ఎన్‌వీవీ.సత్యనారాయణ పాల్గొన్నారు.

బీమా ఏజెంట్ల నిరసన


రాజోలు ఎల్ఐసీ కార్యాలయం వద్ద...

రాజోలు: ఎల్ఐసీ యాజమాన్యం, ఐఆర్‌డీఏ అనుసరిస్తున్న విధానాలకు నిరసన వ్యక్తం చేస్తూ బీమా ఏజెంట్లు శుక్రవారం రాజోలు కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ అన్ని పాలసీలపై జీఎస్టీని రద్దు చేయాలని, పాలసీలను పాత పద్ధతిలోనే కొనసాగించాలన్నారు. పాలసీలపై బోనస్ పెంచాలని, ప్రీమియం రేట్లు తగ్గించాలని డిమాండ్ చేశారు. రాజమండ్రి డివిజన్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి మాలే నాగబాబు, రాజోలు బ్రాంచి అధ్యక్షుడు అడబాల శ్రీనివాసరావు, కడలి వేణుగోపాలకృష్ణ, రావి విజయ్, విత్తనాల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.


కేశనపల్లిలో పల్లె పండగలో ఎమ్మెల్యే దేవ, ఎంపీపీ సత్యవాణి తదితరులు


అయినవిల్లింకలో రహదారి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

గ్రామాభివృద్ధిలో ప్రజలు మమేకం కావాలి

మలికిపురం, న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధిలో ప్రజలు కూడా మమేకం కావాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా గొల్లపాలెం, తూర్పుపాలెం, కేశనపల్లి, పడమటిపాలెం, బట్టేలంక గ్రామాల్లో సీసీ రహదారుల నిర్మాణాలకు శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. ఎంపీపీ మేడిచర్ల వెంకటసత్యవాణి, మార్క్‌ఫెడ్ డైరెక్టరు గుండుబోగుల పెద్దకాపు, సర్పంచులు నాగేశ్వరరావు, మురళీవెంకటసత్యనారాయణ, నాగు, మాధవీనాగలక్ష్మి, సీతారత్నం, ఎంపీటీసీ సభ్యులు అనంతలక్ష్మి, సుబ్బారావు, రాపాక సత్యనారాయణ, సుజాత, లలితాశివజ్యోతి, నాయకులు ఆకుల చినవెంకన్నాయుడు, మల్లిపూడి సత్తిబాబు, యుగంధర్, నాని పాల్గొన్నారు.

అయినవిల్లి: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మండలంలోని నల్లచెరువు, అయినవిల్లి, మడుపల్లి, నేదునూరు, అయినవిల్లిలంక గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. మండల తెదేపా అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాసరావు, మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, సర్పంచులు కాకర శ్రీనివాసరావు, కుమ్మరి మాధవి, గుమ్మడి ప్రసాద్, కాశీ వీర వెంకటసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పునీటిలో కొబ్బరి సూద మొక్కలు



శంకరగుప్తం మేజరు డ్రెయినులోని ఉప్పునీరు పొంగి గట్టు పక్కనున్న తోటల్లోకి చేరడంతో గత రెండు మూడేళ్ల నుంచి వేలాది కొబ్బరిచెట్లు చచ్చిపోయాయి. రైతులు ఆర్థికంగా ఎంతో నష్టపోయారు. తాజాగా ఈ డ్రెయినును ఆనుకుని ఉన్న పలు కొబ్బరి సూద మొక్కలకు కూడా అదే పరిస్థితి ఏర్పడింది. గత నాలుగు రోజుల నుంచి ఏకధాటిగా కురిసిన వర్షాలతో మళ్లీ డ్రెయిను పొంగి నీరు మొక్కలను చుట్టుముట్టింది. ఇవికూడా దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. ఉప్పునీరు తోటల్లోకి రాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు. – న్యూస్‌టుడే, మలికిపురం

షర్మిల సారథ్యంలో కాంగ్రెస్ బలోపేతం


పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గోపాలకృష్ణరాజు

మలికిపురం, న్యూస్‌టుడే: పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కానుందని పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణరాజు అన్నారు. శుక్రవారం విజయవాడలో షర్మిలను మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడినట్లు చెప్పారు. నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి పార్టీకి పూర్వ వైభవం తెద్దామని ఆమె పిలుపునిచ్చారన్నారు. నియోజకవర్గంలో పరిస్థితిని ఆమెకు వివరించినట్లు చెప్పారు.

గంగపుత్రుల అప్రమత్తం... తప్పిన ప్రమాదం


ఒరిగిపోయిన విద్యుత్తు స్తంభం

సఖినేటిపల్లి, న్యూస్‌టుడే: అంతర్వేది పల్లిపాలెంలో త్రుటిలో విద్యుత్తు ప్రమాదం తప్పింది. వాయుగుండం ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకుతోడు సముద్ర పోటు కారణంగా గురువారం రాత్రి గ్రామంలో ప్రధాన రహదారులపై గోదావరి నీరు ఉద్ధృతంగా ప్రవహించడంతో పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాలు ఒరిగిపోయాయి. అటుగా చేపల వేటకు వెళ్తున్న గంగపుత్రులు గమనించి వెంటనే విద్యుత్తు సిబ్బందికి తెలియజేశారు. లైన్‌మెన్ గిరి, సిబ్బంది వచ్చి స్తంభాలకు తాళ్లు వేసి పడిపోకుండా కట్టారు. శుక్రవారం ఉదయం వచ్చి ఒరిగిపోయిన స్తంభాలను సరిచేశారు. వెంటనే స్పందించకపోతే విద్యుత్తు తీగలు రహదారులపై, చేలల్లో పడేవని.. ప్రయాణికులు, చేపల వేట చేసే మత్స్యకారులు ప్రమాదం బారిన పడేవారని స్థానికులు ఆందోళన వెలిబుచ్చారు. వెంటనే స్పందించి రక్షణ చర్యలు చేపట్టిన విద్యుత్తు సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఏటిగట్లు తీరిది.. వెళ్లే దారేదీ!

న్యూస్‌టుడే – మామిడికుదురు, ఆత్రేయపురం

మామిడికుదురు, ఆత్రేయపురం మండలాల్లో ఏటిగట్లు దుస్థితికి చేరడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బలహీనంగా ఉన్న ఏటిగట్లను ఆధునికీకరణ చేయకపోవడంతో తరచూ వచ్చే వరదల సమయంలో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. మామిడికుదురు మండలం ఆదుర్రు నుంచి పాశర్లపూడి మీదుగా పెదపట్నం వరకు సుమారు 9 కిలో మీటర్ల మేర ఏటిగట్టు బురదమయంగా మారడంతో రాకపోకలకు అయిదు గ్రామాల ప్రజలు తీవ్ర యాతనలు పడుతున్నారు. దీనిపై కంకర రోడ్డు వేసి పటిష్ఠం చేయడానికి గతంలో ప్రతిపాదనలు చేసినా పనులు చేపట్టకపోవడంతో కొన్నిచోట్ల మట్టి జారిపోయింది. రైతుల అవస్థలను హెడ్‌వర్క్స్ ఏఈఈ టీవీఎల్ఎన్ మూర్తి దృష్టికి తీసుకువెళ్లగా, గట్టును పరిశీలించి సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. ఆత్రేయపురం మండలంలో ఏటిగట్టు ఆధునికీకరణ పనుల్ని గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. 1986 ఆగస్టులో వచ్చిన వరదల స్థాయికి ఎత్తు చేయడంతోపాటు శిథిల స్లూయిస్‌ల స్థానే కొత్తవి నిర్మించాల్సి ఉంది. 2007లో రూ.55 కోట్లతో వశిష్ఠ ఎడమ గట్టుపై మెటల్ రోడ్డు దాదాపు ఛిద్రమైంది. రాళ్లు లేచిపోయి పిచ్చిమొక్కలు మొలవడంతో నడిచేందుకు వీల్లేని విధంగా తయారయింది. పులిదిండి తదితర చోట్ల రక్షణగా గ్రోయిన్స్ నిర్మించకపోవడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గౌతమి కుడిగట్టుపై వెలిచేరు, వాడపల్లి, వద్దిపర్రు, నరసన్నపేట, ఉచ్చిలి, పేరవరం, మెర్లపాలెం తదితర గ్రామాల్లో ఆధునికీకరణ పనులు చేయకపోవడంతో వరదల సమయంలో బలహీనంగా ఉన్న చోట అండలు జారిపోతోంది. వరదల సమయంలో ఇసుక బస్తాలు వేసి తాత్కాలిక రక్షణ చర్యలతో సరిపెడుతున్నారు.

ఈ సమస్యపై హెడ్ వర్క్స్ ఏఈ ప్రసాద్‌ను వివరణ కోరగా, అప్పట్లో మట్టి ఇబ్బందులు తదితర కారణాలతో ఏటిగట్ల అభివృద్ధి పనులు నిలిచిపోయాయన్నారు. మిగతా పనులు పూర్తిచేసేందుకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించామన్నారు. ప్రస్తుతం ఎటువంటి ప్రమాదం లేదని, ఆందోళన చెందనవసరం లేదన్నారు.


ఆదుర్రులో దుర్భరంగా మారిన ఏటిగట్టు


కట్టుంగ వద్ద పిచ్చిమొక్కలతో ఉన్న ఏటిగట్టు

పారిశుద్ధ్య పనుల్లో పంచాయతీ పాలకవర్గం

కొత్తపేట, న్యూస్‌టుడే: కొత్తపేట పంచాయతీ పరిధి కొప్పిశెట్టివారి వీధి, గణేష్‌నగర్, మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన పారిశుద్ధ్య పనుల్లో సిబ్బందితోపాటు పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాలుపంచుకున్నారు. పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యం తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు వారు తెలిపారు. భూసి భాస్కరరావు, విళ్ళ మారుతి, బండి రాజు, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించాలి

ఆలమూరు, న్యూస్‌టుడే: వ్యవసాయ శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తూ రైతులకు అన్ని అంశాలపై అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు అన్నారు. ఖరీఫ్ కాలంలో తెగుళ్లు, పురుగుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై శుక్రవారం జొన్నాడ రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ ఇచ్చారు. కొనుగోళ్లకు సంబంధించి విధివిధానాలపై అవగాహన కల్పించారు.

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

కేంద్ర బృంద సభ్యుల తనిఖీ



పంచాయతీ సిబ్బందితో బృంద సభ్యులు

కాట్రేనికోన: జాతీయ స్థాయి మానిటరింగ్ బృందం రాష్ట్ర స్థాయి పర్యవేక్షణలో భాగంగా కేంద్రం నుంచి వచ్చిన సెల్వాన్, తిలక్‌లు శుక్రవారం మండలంలోని బంటుమిల్లి, చెయ్యేరులో తనిఖీలు చేశారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్, గృహనిర్మాణం, ఐకేపీ, పంచాయతీరాజ్ తదితర కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి శుక్రవారం వారు గ్రామాల్లో చేపట్టిన పనులను పరిశీలించి, కార్యాలయంలో వివిధ దస్త్రాలను తనిఖీ చేశారు. ఏపీడీ రాంబాబు, కె. సత్యనారాయణ, జి.కవిత, ఎస్.వెంకటాచలం, చంద్రమోహన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు పరిశీలన



సమస్య తెలుసుకుంటున్న అధికారులు

అమలాపురం గ్రామీణం: బండారులంకలోని శృంగవరపాటి సమీపంలోని డంపింగ్‌యార్డును డీపీవో శాంతలక్ష్మి, ఆర్డీవో మాధవి శుక్రవారం పరిశీలించారు. డంపింగ్ యార్డు సమీపంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యార్డును మార్చాల్సి వస్తే స్థలం సేకరణపై అధికారులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను సర్పంచి మెహమూద సునీత అధికారులకు వివరించారు. డీఎల్పీవో బొజ్జిరాజు, ఎంపీడీవో బాబ్జీరాజు, తహసీల్దార్ కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా



వీధి దీపాలకు మరమ్మతులు

సమస్య: నడవపల్లి పంచాయతీ పరిధిలో కొన్ని వీధి దీపాలు వెలగడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి వీధిదీపాలకు మరమ్మతులు చేయాలి. - స్థానికులు

పరిష్కారం: సమస్యను పంచాయతీ సర్పంచి పల్లవి దృష్టికి తీసుకెళ్లగా స్పందించి సిబ్బందితో వీధిదీపాలకు మరమ్మతులు చేయించారు.

చెత్త తొలగించారు

సమస్య: కాట్రేనికోనలోని ఆంజనేయ స్వామి గుడి పరిధిలో రోడ్డుపక్కన చెత్త పేరుకుపోయింది. పంచాయతీ అధికారులు స్పందించి చెత్తను తొలగించే పనులు చేపట్టాలి. - గ్రామస్థులు

పరిష్కారం: సమస్యను సర్పంచి సుధాకర్‌కు తెలుపగా స్పందించి సిబ్బందితో పరిసరాల్లో చెత్తను తొలగించారు. - న్యూస్‌టుడే, కాట్రేనికోన

సమయం: ఉ॥ 10 గం॥ నుంచి మ॥ ఒంటి గంట వరకు
మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
అమలాపురం: **7981119595**, ముమ్మిడివరం: **8008574166**

వర్షపాతం నమోదు యంత్రం పరిశీలన



అమలాపురం గ్రామీణం: ఈదరపల్లి విద్యుత్తు ఉపకేంద్రంలో ఏర్పాటు చేసిన వర్షపాతం నమోదు యంత్రం (ఆటోమేటిక్ రెయిన్ గేజ్ మీటర్)ను జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. యంత్రం ద్వారా వర్షపాతం నమోదు ఏవిధంగా జరుగుతుందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఈ రాజబాబు, ఈఈ రవికుమార్, డీఈఈ విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో చెరువులు

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం పట్టణం జిల్లా కేంద్రం కావడంతో స్థలాలకు విపరీతమైన డిమాండు, పెరిగిన ధరల నేపథ్యంలో చెరువులు, కాలువలు, పోరంబోకు స్థలాలపై ఆక్రమణదారుల కళ్లు పడుతున్నాయి. పచ్చని కొబ్బరితోటల మధ్య ప్రకృతి ప్రతిబింబించేలా కనిపించే కోనసీమ కేంద్రమైన అమలాపురం పట్టణంలో ప్రస్తుతం ఇవేమి కనిపించడం లేదు. వైకాపా పాలనలో కొందరు చెరువులనే కబ్జేసి ఆక్రమంగా భవనాలు నిర్మించడం పరిపాటిగా మొదలు పెట్టారు. కొన్ని ప్రాంతాల్లో చెరువుల చుట్టూ ఆక్రమణలు పెరిగిపోయింటే.. మరి కొన్ని చోట్ల చెరువులనే పూడ్చేసి భవనాలు నిర్మిస్తున్నారు.

చెరువుల వివరాలు	గతంలో (ఎకరాల్లో)	ప్రస్తుతం (ఎకరాల్లో) (అంచనా)
మంచినీటి చెరువు (చంద్రబాబు ఉద్యానవనం)	5.16	5.00
కల్వకొలనువీధి తామరచెరువు ....బంగారక్క చెరువు....	11.65	6.00
రవణంవీధి గరిగుంట చెరువు	7.06	2.15
ఎర్రరోడ్డు బండివారిపేట చెరువు	3.39	1.00
గడియారస్తంభం కూడలి కంచెర చెరువు	7.40	ఏమీలేదు
కాలేజీరోడ్డు సుబ్బారాయుడు చెరువు	1.28	0.60
కె.అగ్రహారం చాకలి చెరువు	0.46	0.04 (అమ్మకానికి పెట్టారు)
కాలేజీరోడ్డు సుబ్రహ్మణ్యేశ్వరసామి ఆలయం వద్ద చెరువు...	0.28	ఏమీలేదు

20 ఎకరాలపైనే ఆక్రమణ

పట్టణ ప్రాంతంలో ఏడు చెరువులు 35 ఎకరాల విస్తీర్ణంలో ఉండేవి. ప్రస్తుతం ఇందులో 20 ఎకరాలకు పైగానే ఆక్రమణల చెరలో ఉంది. ప్రధానంగా తామర చెరువు, బంగారక్క చెరువు, గరిగుంట చెరువు, కంచర చెరువు, బండివారి పేట, సుబ్బారాయుడు చెరువుల్లో ఆక్రమణల పర్వం నేటికీ కొనసాగుతోంది. ఈ చెరువుల చుట్టూ భవనాలు నిర్మించిన దాఖలాలు ఉన్నప్పటికీ పురపాలక అధికారులు మాత్రం చర్యలు చేపట్టకుండా మిన్నకుండిపోతున్నారు. తామరచెరువు, బంగారక్క చెరువుల చుట్టూనే అధికశాతం ఆక్రమణలు న్నాయి. వీటిలో కొన్నింటికి పట్టాలు ఉన్నాయని, మరికొన్ని మావేనంటూ విక్రయాలు చేయడం గమనార్హం.



అమలాపురంలోని సుబ్బారాయుడు చెరువు వద్ద దుకాణ సముదాయాలు



అమలాపురంలోని బండివారిపేట చెరువు వద్ద ఆక్రమణలు

కేసు వేసినా ఉపయోగం లేదు...

గతంలో పట్టణానికి చెందిన కుడిపూడి అశోక్ అనే న్యాయవాది చెరువులను పరిరక్షించాలని కోరుతూ కోర్టును ఆశ్రయించారు. అప్పట్లో చెరువులు సర్వే నిర్వహించాలని అధికారులు చేసిన ప్రయత్నానికి ప్రజాప్రతినిధులు అడ్డుపడటంతో ఆక్రమణల ఊసే కనుమరుగైంది. చెరువుల అక్రమణలపై భూరీసర్వేలో అన్ని బయటకు వస్తాయని మాజీ మున్సిపల్ కమిషనర్ వి.అయ్యప్పనాయుడు తెలిపారు. కానీ రీసర్వే జరిగినా రిపోర్టులు బయటకు రాలేదు..

ఆక్రమణలు తొలగిస్తాం..

అనధికార లేఅవుట్ల, అక్రమ నిర్మాణాలను గుర్తించేందుకు పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను నియమించాం. ఆక్రమణలను గుర్తించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటాం. చెరువులను సంరక్షించే విధంగా చూస్తాం. -కేవీవీఆర్. రాజు, అమలాపురం మున్సిపల్ కమిషనర్

పోటీ పరీక్షలతో భావవ్యక్తీకరణ నైపుణ్యం



పోటీపరీక్షలు రాస్తున్న విద్యార్థులు



విజేతలతో డైరెక్టర్ రమేష్, ప్రిన్సిపల్ సబిత

అమలాపురం పట్టణం న్యూస్‌టుడే: ప్రతిభా పాటవ పోటీలతో విద్యార్థుల్లో భావ వ్యక్తీకరణ పెంపొందుతుందని, ఈనాడు నిర్వహిస్తున్న పోటీ పరీక్షలు విద్యార్థులకు మేలు చేస్తాయని తులిప్స్ పాఠశాల డైరెక్టర్ నెల్లి రమేష్ పేర్కొన్నారు. అమలాపురం తులిప్స్ పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు కథ చెప్పడంపై పోటీపరీక్షలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అంతర్జాలయం వినియోగంపై కలిగే లాభాలు, నష్టాలపై.. సామాజిక మాధ్యమ ప్రభావంపై పోటీపరీక్ష నిర్వహించారు. మొదటి మూడు స్థానాల్లో వరుసగా ఎస్.సీతామహాలక్ష్మి, ఎస్.జ్ఞాన దీక్షిత, వై.అలైఖ్యలు విజేతలుగా నిలిచారు. అనంతరం గెలుపొందిన వారికి ఈనాడు సమకూర్చిన బహుమతులను, ప్రశంసా పత్రాలను పాఠశాల డైరెక్టర్ నెల్లి రమేష్, ప్రిన్సిపల్ నెల్లి సబిత, ఇన్‌ఛార్జి విన్న శిరీన్‌జ్యోతి, ఉపాధ్యాయురాలు సీతామహాలక్ష్మి అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు యానాం క్రీడాకారుల ఎంపిక



స్పోర్ట్స్ మీట్‌కు ఎంపికైన క్రీడాకారులు

యానాం, న్యూస్‌టుడే: ఈ నెల 26, 27 తేదీలలో మహేలో జరగబోయే స్టేట్ స్పోర్ట్స్ మీట్ కోసం యానాంలోని 54 మంది విద్యార్థులు ఈ నెల 23న ప్రయాణమవుతున్నారని స్టేడియం సమన్వయకర్త పాలికి ప్రకాష్ తెలిపారు. వీరంతా యానాం జీఎంసీ బాలయోగి క్రీడా మైదానం వద్ద ఉన్న డాక్టర్ వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో అండర్-17 కేటగిరిలో శిక్షణ తీసుకుంటున్నారు. వాలీబాల్‌లో బాలికలు 12, టేబుల్ టెన్నిస్‌లో పురుషులు 24, ఫుట్‌బాల్‌లో 18మంది ఎంపిక య్యారు. క్రీడాకారులకు స్పోర్ట్స్ షూస్, మహేలో ఉన్నన్ని రోజులు భోజన సదుపాయం పుదుచ్చేరి ప్రభుత్వ దిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు పాము సత్యనారాయణ, వి.సన్యాసిరావు, చింతా వెంకన్న, ఐ.వి.కె.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి



వైద్యలింగంను సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

యానాం, న్యూస్‌టుడే: పుదుచ్చేరి పార్లమెంట్ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వి.వైద్యలింగంను, ఎమ్మెల్యే వైథనాధన్‌ను యానాం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లాడి సత్తిబాబు, బీర స్వామి, వేపాటి వెంకటేశ్వర్లు, కాటూరి చౌదరి శుక్రవారం పుదుచ్చేరిలో కలిసి.. సత్కరించారు. ఓఎన్జీసీ రెండవ విడత పరిహారం మత్స్యకారులకు దీపావళి కంటే ముందుగా ఖాతాల్లో జమచేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. యానాంలో కాంగ్రెస్ కమిటీలలో సీనియర్ నాయకులకు, పార్టీ కోసం శ్రమించే వారికి అవకాశం కల్పించాలని కోరారు.

చోరీ కేసులో అంతర్ జిల్లా నేరగాడి అరెస్టు

నరసాపురం: చోరీ కేసులో అంతర్ జిల్లా నేరగాడిని అరెస్టు చేసి సొత్తు స్వాధీనం చేసుకున్నామని అదనపు ఎస్పీ ఎంబీఎన్ మురళీకృష్ణ తెలిపారు. ఆయన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నరసాపురం పట్టణంలోని 20వ వార్డు గాంధీనగర్ పిల్లిపేటకు చెందిన రవ్వ ఉమామహేశ్వరి పగలు ప్రయివేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తూ రాత్రి సమయంలో అత్యవసర వాహనంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 1న రాత్రి ఇంటికి తాళం వేసి విధులకు వెళ్లారు. మరుసటి రోజు ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులకు వేసిన తాళం పగుల కొట్టి 122గ్రాముల బంగారు ఆభరణాలు, 100 గ్రాముల వెండి ఆభరణాలు అపహరించుకు పోయారు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి కేసు నమోదు చేశారన్నారు. ఈ కేసు ఎస్పీ, అదనపు ఎస్పీల ఆధ్వర్యంలో పట్టణ సీఐ బి.యాదగిరి, ఎస్సైలు అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం చింతాడ గ్రామానికి చెందిన నిందితుడు మండెల నాగ భాస్కరరావును అరెస్టు చేశారన్నారు. అతని నుంచి 71.47 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లలో 15 కేసులు నమోదయ్యాయని ఆయన తెలిపారు. ఇదే కేసులో మరో నిందితుడిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు.

ఇక్కడ మురుగు తొలగదు



అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: అమలాపురం పట్టణంలో మున్సిపల్ సర్క్యులర్ బజార్ ప్రాంతంలో మురుగు తొలగించడంలేదని స్థానిక వ్యాపారులు వాపోతున్నారు. బజార్ ఎదురుగా, పక్కన చెత్త, మురుగునీరు పేరుకుపోయాయన్నారు. అటుగా వెళ్లే వాహనదారులకు, వచ్చే ప్రయాణికులకు రోడ్డుపై చెత్త, మురుగు దర్శనమిస్తుంది. ఇటీవల కురిసిన వర్షం నీరు, వ్యర్థాలు పేరుకుపోయి ముందుకు వెళ్లక రోడ్డుపైకి ప్రవహిస్తోంది. సమస్యను సచివాలయ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే శుభ్రం చేయిస్తామన్నారు.

క్రీడాకారుల ఎంపిక

అమలాపురం పట్టణం న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో 68వ స్కూల్ ఆఫ్ గేమ్స్ అండర్ -14, 17 విభాగాల్లో బాలుర, బాలికలు ఎన్నిక విధానం నిర్వహించామని జిల్లా విద్యా శాఖ అధికారిణి ఎం.కమలకుమారి తెలిపారు. అమలాపురంలోని ఓసీ క్లబ్‌లో విద్యార్థులకు ఎంపిక కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో కమలకుమారిని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, రంకిరెడ్డి కాశీవిశ్వనాథ్‌లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీవైఈవో సూర్యప్రకాశరావు, విజయ్‌శ్రీనివాస్, తోట రవి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు వంట సామగ్రి అందజేత

అల్లవరం, న్యూస్‌టుడే: గోడితిప్ప గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలకు స్థానికులు కొల్లు త్రినాథ వర్మ వంట సామగ్రి అందజేశారు. రూ.10వేల విలువ గత ఆహార పదార్థాలు నిలువ చేసే హాట్ బాక్సులను అందించారు. అదేవిధంగా బసవా సత్యనారాయణ, వరలక్ష్మి జ్ఞాపకార్థం రూ.6వేల విలువ చేసే కుర్చీలను వారి కుటుంబ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చిట్నీడి శ్రీదేవి, పాఠశాల ఎస్ఎంపీ ఛైర్మన్ వేణుగోపాల్, ప్రధానోపాధ్యాయులు నరసింహారావు, చిట్నీడి శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ముమ్మిడివరం: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో జాప్యం తగదని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఉపాధ్యాయులు శుక్రవారం డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు వర్తించే సౌకర్యాలు, ఉత్తర్వులు మున్సిపల్ ఉపాధ్యాయులకు వర్తించడం లేదన్నారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. డీఈవో కార్యాలయ ఏడి సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. జ్యోతిబసు, వెంకటేశ్వరరావు, విజయకృష్ణ, సురేంద్రకుమార్ పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

రాకపోకలకు తిప్పలే..



కాట్రేనికోన నుంచి స్థానిక హైస్కూల్‌కు వెళ్లే రోడ్డు గుంతలు పడటంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు పోలీసు స్టేషను మలుపు సహా పలుచోట్ల గుంతలు పడటంతో కురుస్తున్న వర్షాలకు నీరంతా ఆ గుంతల్లో చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పాఠశాల విద్యార్థులు, రామస్వామితోట, చెంచులగరువు సహా వివిధ ప్రాంతాలకు చెందినవారు వాపోతున్నారు. జేఈ ఫకీర్‌ను అడుగగా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. - న్యూస్‌టుడే, కాట్రేనికోన

భక్తులకు అన్నదానం

యానాం, న్యూస్‌టుడే: యానాం వెంకటన్‌నగర్‌లో వెలసిన వెంకట దుర్గాదేవి అమ్మవారి నవరాత్రుల మహోత్సవాలు సందర్భంగా శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్న సంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పుదుచ్చేరి ప్రభుత్వ దిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అమ్మవారిని దర్శించుకుని భక్తులకు అన్నదానం చేశారు.

జీతాలు ఇప్పించండి సారూ...

అమలాపురం పట్టణం: అమలాపురం పురపాలక సంఘ కార్యాలయంలో పనిచేస్తున్న ఆటోటిప్పర్ డ్రైవర్లకు మూడు నెలల జీతాలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా నాయకుడు సత్తిబాబు పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా సత్తిబాబు ఆధ్వర్యంలో క్యాబ్ డ్రైవర్లు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు తమ జీతాలు చెల్లించాలని నినాదాలు చేశారు.



ఓడలరేవు మరిడమ్మ కూడలి వద్ద రహదారిపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

గుంతల దారిలో ఇక్కట్లే

అల్లవరం, న్యూస్‌టుడే: ఓడలరేవు పంచాయతీ పరిధిలో ఉన్న ప్రధాన రహదారిపై ఉన్న గుంతల్లో వర్షపు నీరు నిలిచి మడుగులను తలపిస్తున్నాయి. మరిడమ్మ కూడలి నుంచి ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిపై నిత్యం విద్యార్థులు, స్థానికులు, సముద్ర తీరానికి వచ్చే పర్యాటకులు ప్రయాణం చేస్తున్నారు. ఎక్కడికక్కడ గుంతలు పడి మహిళా వాహన దారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై పీఆర్ ప్రాజెక్టు డీఈఈ అన్యం రాంబాబును వివరణ కోరగా బెండమూర్లంక కూడలి నుంచి ఓడలరేవు ఓఎన్జీసీ ప్లాంట్ వరకు రహదారి ఆధునికీకరణ పనులు నిర్వహిస్తున్నామని, త్వరలోనే పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు.

నట్టల నివారణ మందులు తప్పనిసరి

కాట్రేనికోన, న్యూస్‌టుడే: పాడి రైతులంతా తమ పశువులకు నట్టల నివారణ మందులను తప్పకుండా వేయించాలని కాట్రేనికోన పశువైద్యాధికారిణి యామిని తెలిపారు. మండలంలోని కుండలేశ్వరంలో మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులను వేశారు. అన్ని గ్రామాల్లోనూ పశువులకు ఈ మందులు వేస్తామన్నారు. చందు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణం తొలగించాలి

అమలాపురం పట్టణం: పట్టణంలో మున్సిపల్ సర్క్యులర్ బజార్ ఎదురుగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని స్థానికులు అబ్కారీ శాఖ కార్యాలయానికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. నివాసితుల మధ్యన, ఆసుపత్రి పక్కన మద్యం దుకాణం ఎలా ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: ముమ్మిడివరం బాలుర హైస్కూల్లో మధ్యాహ్నభోజన పథకాన్ని ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. రుచికరమైన భోజనాన్ని విద్యార్థులకు వండిపెట్టాలని సిబ్బందికి సూచించారు.

బాధితులకు పరామర్శ



అమలాపురం పట్టణం: అమలాపురం పట్టణంలో పిచ్చి కుక్క స్వైరవిహారంతో 25మంది గాయపడ్డారని ఈనాడులో కథనం ప్రచురితమైంది. దీంతో మున్సిపల్ కమిషనర్ రాజు స్థానిక ఏరియా ఆసుపత్రిలో బాధితులను శుక్రవారం పరామర్శించారు. తీవ్రంగా గాయపడిన చప్పిడి సత్యనారాయణ, చప్పిడి అనంతలక్ష్మిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలలో పట్టణంలో 102 కుక్కలకు రేబిస్ ఇంజిక్షన్ వేయించామని, ఎటువంటి ప్రమాదం లేదని తెలిపారు.

భూసర్వేపై అభ్యంతరాల స్వీకరణ

ఉప్పలగుప్తం: గతంలో భూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ఏమైనా అభ్యంతరాలు, వినతులు ఉంటే తెలియపరచాలని ఉప్పలగుప్తం తహసీల్దారు దివాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో సన్నవిల్లి, కూనవరం, చినగాడవిల్లి, నంగవరం, విలసవిల్లి గ్రామాల్లో గ్రామానికి ఒక్క రోజు చొప్పున 19, 21, 22, 23, 24 తేదీల్లో గ్రామసభలు నిర్వహించి రీ-సర్వే భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తామని, అవకాశాన్ని భూ యాజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

అల్లవరం: అల్లవరం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో శనివారం నిర్వహణ పనులు చేపడుతున్న కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ రవికుమార్ శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పుదుచ్చేరి ప్రభుత్వ ఉద్యోగులకు దీపావళి బోనస్

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వం దీపావళి ముందు ప్రభుత్వ ఉద్యోగులకు బోనస్ ప్రకటించింది. దీంతో 23 వేలమంది ప్రభుత్వ ఉద్యోగులకు ఒక్కొక్కరికి రూ.7 వేలు మించకుండా బోనస్ లభిస్తుందని సీఎం రంగస్వామి ప్రకటించినట్లు ప్రభుత్వం నోటిఫికేషన్‌ను శుక్రవారం విడుదల చేసింది.

ప్రగతి రథం నడిపేద్దాం.. ఉపాధి పొందేద్దాం

ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్‌కు విశేష స్పందన

న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

బస్సు నడపాలంటే ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. అలాంటి ప్రగతి రథం నడిపేందుకు ఆర్టీసీ శిక్షణ ఇస్తోంది. ఈ శిక్షణ ద్వారా ఆర్టీసీకి ఆదాయం సమకూరుతుంటే.. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు దొరుకుతున్నాయి. అమలాపురం ఆర్టీసీ డిపో పరిధిలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ తరగతులను రెండేళ్ల నుంచి నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు తొమ్మిది బ్యాచ్‌లకు శిక్షణ పూర్తవగా.. త్వరలోనే పదో బ్యాచ్‌కు శిక్షణ అందించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ శిక్షణకు వెళ్లాలంటే ఏవిధంగా దరఖాస్తు చేసుకోవాలో తెలుసుకుందామా..



20 ఏళ్లు నిండాల్సిందే..

20 ఏళ్లు నిండిన యువతకు ఈ శిక్షణ అందిస్తున్నారు. ఏడాది ఎల్ఎంవీ లైసెన్సు కలిగి ఉండే వారికే శిక్షణ తీసుకునేందుకు అర్హులుగా నిర్ణయించారు. ఆర్టీసీ డ్రైవింగ్ శిక్షణకు సంబంధించి ప్రత్యేక బస్సులను ఉపయోగిస్తున్నారు. ఈ బస్సులో రెండు స్టీరింగ్‌లను ఏర్పాటు చేసి శిక్షణ సమయంలో ఎలాంటి ప్రమాదాలు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు ద్వారా తర్ఫీదును అందిస్తున్నారు. శిక్షణకు అర్హులైన వారిని ఎంపిక చేసి డ్రైవింగ్ నేర్పించడమే కాకుండా వారికి ఆర్టీసీలో ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా అడుగులు వేస్తున్నారు.

శిక్షణే కాదండోయ్..

ఆర్టీసీలో శిక్షణ తీసుకునే నిరుద్యోగులకు డ్రైవింగ్‌తోపాటు అన్ని విభాగాల్లో పరిణతి పొందేలా తర్ఫీదు ఇస్తున్నారు. ముఖ్యంగా బస్సు కండిషన్, ఇంజిన్ విభాగాలు, వాటి పనితీరుపై థియరీతోపాటు అవగాహన కల్పిస్తున్నారు. బస్సులోని విడిభాగాల్లో తలెత్తే సమస్యలు, వాటి లోపాలను పరిష్కార మార్గాలకు సంబంధించిన అంశాలను వివరిస్తున్నారు. శిక్షణ పూర్తవగానే ధ్రువీకరణ పత్రాన్ని అందించడంతోపాటు రవాణాశాఖ ద్వారా డ్రైవింగ్ లైసెన్సు పొందేందుకు అవకాశం కల్పిస్తున్నారు.




శిక్షణలో భాగంగా పుస్తకాలు అందిస్తున్న అధికారులు

శిక్షణకు సంబంధించిన సమాచారం

శిక్షణ అందించే కాలపరిమితి	:	32 రోజులు
ఒక్కో బ్యాచ్‌లో శిక్షణ పొందేవారి సంఖ్య	:	16
రెండేళ్లలో శిక్షణ తీసుకున్నవారు	:	144 మంది
డ్రైవింగ్ శిక్షణ ద్వారా ఇప్పటి వరకు ఆర్టీసీకి సమకూరిన ఆదాయం	:	రూ.33.98లక్షలు

సద్వినియోగం చేసుకోవాలి



ఆర్టీసీ ద్వారా అందించే డ్రైవింగ్ శిక్షణను అర్హులైన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి. అమలాపురం ఆర్టీసీ డిపో పరిధిలో ఇప్పటి వరకు తొమ్మిది బ్యాచ్‌లకు శిక్షణ అందించాం. పదో బ్యాచ్‌కు శిక్షణ అందించేందుకు సమాయత్తమవుతున్నాం. - సీహెచ్.సత్యనారాయణమూర్తి, డిపో మేనేజర్

దొంతికుర్రులో ముగిసిన కవలల అంత్యక్రియలు

కాట్రేనికోన, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని జీడిమెట్లలో ప్రమాదవశాత్తు రసాయనాల ట్యాంకులోపడి మృతి చెందిన కవల సోదరులు వస్కా రామ్, లక్ష్మణ్‌ల అంత్యక్రియలు శుక్రవారం వారి స్వగ్రామం దొంతికుర్రులోని కోతులచెరువులో నిర్వహించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

మల్లాడిని కలిసిన విద్యుత్తు శాఖ అధికారులు

యానాం: గోపాల్‌నగర్ విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో జేఈ ఓఎస్ఎంగా సేవలందిస్తున్న లంక నక్షత్రం యానాం విద్యుత్తుశాఖకు బదిలీ అయ్యారు. పుదుచ్చేరి ప్రభుత్వ దిల్లీ ప్రత్యేకప్రతినిధి మల్లాడి కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు.

మండపేట

•మండపేట •రామచంద్రపురం

వాసవి అమ్మవారికి కుంకుమార్చన

ద్వారపూడి: ద్వారపూడి గ్రామం పాత వస్త్రదుకాణ సముదాయం వద్ద ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నూతనంగా నిర్మించిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా అన్నసమారాధన

అంగర: కపిలేశ్వరపురం మండలం అంగర జిల్లానది తీరంలో కొలువైన విజయదుర్గాదేవి ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపును పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో అంగర, పడమర ఖండ్రిక, తాతపూడి, కమురుల పాలెం, కపిలేశ్వరపురం, టేకి తదితర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సుమారు 4,000 మంది అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

మండపేటలో సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలి

మండపేట: మండపేట నియోజకవర్గం పరిధిలో సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు చేయాలని భాజపా నాయకులు కోరారు. శుక్రవారం రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని కలిసి భాజపా రాష్ట్ర ఇన్‌ఛార్జి సిద్ధార్థ సింగ్ సమక్షంలో వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ కన్వీనర్ కెవి. సాయిరామ్, జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, కార్యదర్శి గొడవర్తి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


పురందేశ్వరికి వినతిపత్రం ఇస్తున్న భాజపా నాయకులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న గణేష్ చౌదరి

ఉత్సాహంగా వ్యాసరచన పోటీలు


వ్యాసరచనలో పాల్గొన్న విద్యార్థులు

మండపేట, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో స్థానిక ఆలమూరు రోడ్డులోగల విజ్ఞాన్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన వ్యాసరచన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలపై సోషల్ మీడియా ప్రభావం అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ పోటీల్లో 10వ తరగతి విద్యార్థిని ఐఎస్ఎస్ పూజిత ప్రథమ, 9వ తరగతి విద్యార్థిని వి.హేమశ్రీవల్లి ద్వితీయ, 8వ తరగతి విద్యార్థిని సిహెచ్ అంకిత హర్షిణి తృతీయ బహుమతులు పొందారు. వీరికి ఈనాడు సమకూర్చిన బహుమతులను విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ యినపకోళ్ల గణేష్ చౌదరి అందజేశారు. విద్యార్థుల్లోని ప్రతిభాపాటవాలను వెలికి తీయడానికి ఈ పోటీలు దోహద పడతాయన్నారు. న్యాయ నిర్ణేతలుగా జి.మమత, పి.శిరీష, ఎన్. అరుణకుమారి, రవి వ్యవహరించారు. పాఠశాల ప్రిన్సిపల్ నూని ప్రసాద్ పర్యవేక్షణ చేశారు.

నచ్చిన మిల్లుకే ధాన్యం..!

రైతులకు కూటమి ప్రభుత్వం భరోసా

అంగర, న్యూస్‌టుడే: రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కనీస మద్దతు ధరకు విక్రయించుకోవచ్చని.. ఆన్‌లైన్ ద్వారా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ అంటూ గత వైకాపా ప్రభుత్వం అన్నదాతలను అవస్థలకు గురిచేసింది. రైతులు తాము పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి నానాఇబ్బందులు పడ్డారు. తేమశాతం, రవాణా ఛార్జీల రూపంలో రైతులు నష్టాలు చవిచూశారు. ప్రస్తుత కూటమి సర్కారు రైతులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకుని, వారికి నచ్చిన రైస్‌మిల్లుకే ధాన్యాన్ని విక్రయించుకునే వెసులుబాటు ప్రకటించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో కర్షకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


వెదురుమూడిలో ధాన్యాన్ని మిల్లుకు తరలిస్తున్న రైతులు

48 గంటల్లోనే నగదు జమ..

వైకాపా హయాంలో రైతులు ధాన్యం డబ్బుల కోసం వారాల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేది. ఈ లోపు ఎరువుల దుకాణాల వద్ద అరువు తెచ్చిన పురుగు మందులకు, వ్యవసాయ కూలీలకు నగదు చెల్లించడం కోసం అనేక ఇబ్బందులు పడేవారు. అప్పులు చేసి వడ్డీలు కట్టేవారు. కూటమి సర్కారు ధాన్యం దిగుమతి పూర్తయిన 48 గంటల్లోనే నగదు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. సన్న రకం క్వింటాలుకు రూ.2,300, సూపర్‌ఫైన్ క్వింటాలుకు రూ.2,320 మద్దతు ధరలు ఇవ్వనున్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటితోపాటు 40 కిలోల గోనె సంచులకు రూ.3.33 పైసలు, హమాలీ ఛార్జీలు క్వింటాల్‌కు రూ.17.77 పైసలు, రవాణాకు 0 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలో టన్నుకు రూ.260 చొప్పున అందజేయనున్నారు.

మండపేట నియోజక వర్గంలో..	
వరి సాగు: 47,419 ఎకరాలు	సాగు చేసే రైతులు: 42,321
ఖరీఫ్‌లో ధాన్యం దిగుబడి లక్ష్యం: 1,25,900 మెట్రిక్ టన్నులు	
ధాన్యం మిల్లులు: 120	కొనుగోలు కేంద్రాలు: 47


ఎంతో మేలు..



గత వైకాపా ప్రభుత్వ హయాంలో ధాన్యాన్ని విక్రయించే ప్రక్రియలో ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రభుత్వం నిర్దేశించిన మిల్లుకే ధాన్యాన్ని తీసుకెళ్లాల్సి వచ్చేది. అక్కడ మిల్లర్లు చెప్పిన ధరకే పంటను విక్రయించాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం రైతులకు నచ్చిన మిల్లులో ధాన్యం అమ్ముకోవచ్చన్న నిర్ణయం మేలు చేస్తుంది.

- తోరాటి కనక రామకృష్ణ, రైతు, అంగర

ఈ ఖరీఫ్ నుంచే అమలు..



రైతులు పండించిన ధాన్యాన్ని సమీపంలోని రైసుమిల్లుల్లో విక్రయించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. త్వరలో రైతులకు రాయితీపై టార్పలిన్లు, బరకాలు, స్ప్రేయర్లు, పవర్ టిల్లర్లు, ట్రాక్టరు పనిముట్లు అందజేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వీటి కోసం సమీప రైతు సేవాకేంద్రాల్లో నమోదు చేసుకోవాలి. ఈ ఖరీఫ్ సీజన్ నుంచే ధాన్యాన్ని నచ్చిన రైసుమిల్లులో విక్రయించడానికి చర్యలు తీసుకుంటున్నాం. సభలు పెట్టి రైతులకు ఇష్టమైన మిల్లుల వివరాలను తెలుసుకుని ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం.

- కేవీఎన్ రమేష్‌కుమార్, ఇన్‌ఛార్జి ఏడీ, వ్యవసాయ శాఖ, కపిలేశ్వరపురం

మేమున్నాం.. మీకు తోడుగా

మండపేట: 80085 74183, రామచంద్రపురం: 80085 74191

విద్యుత్ దీపాలు వెలగక ఇబ్బంది

సమస్య: మారేడుబాక-కపిలేశ్వరపురం ప్రధాన రహదారిలో రాత్రి సమయంలో విద్యుత్ దీపాలు సరిగా వెలగటం లేదు. పంచాయతీ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

- వెంకటరామయ్య, మారేడుబాక

సమాధానం: సమస్యను పరిశీలించి విద్యుత్‌దీపాలు వెలిగేలా చర్యలు చేపడతాము.

- వరప్రసాదరావు, పంచాయతీ కార్యదర్శి

సమస్య: రామచంద్రపురం పట్టణ 5వ వార్డు వైఎస్సార్ నగర్ 14వ వీధిలో ఉన్న 4 వీధి దీపాలు గత నాలుగు రోజులుగా వెలగడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి. - సత్యనారాయణ, న్యాయవాది

సమాధానం: వీధి దీపాలు పరిశీలించి వెంటనే మరమ్మతులు చేసేలా చర్యలు తీసుకుంటాం.

- శ్రీకాంత్, మున్సిపల్ డీఈ

సమస్య: జడ్.మేడపాడు ఎస్సీకాలనీలో కల్వర్టుకు, రహదారికి అనుసంధానంగా రోడ్డు సరిగా వేయలేదు. దీని వల్ల వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. - కృపరాజు, జడ్.మేడపాడు

సమాధానం: అనుసంధాన రహదారికి మరమ్మతులు చేస్తాం.

- అమర్‌నాథ్, పంచాయతీ కార్యదర్శి, జడ్.మేడపాడు

మురుగు పారడంలేదు

సమస్య: ద్వారపూడి పంచాయతీ పరిధి వస్త్ర దుకాణ వీధిలో డ్రెయినేజీలో మురుగు పారడం లేదు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

- ఆర్.సత్యం, ద్వారపూడి

సమాధానం: సిబ్బందిని పంపి డ్రెయినేజీలో పూడికలు తీయిస్తాం.

-రమణ, పంచాయతీ కార్యదర్శి, ద్వారపూడి

సమస్య: రాయవరం ఈశ్వరరెడ్డి కాలనీలో డ్రెయినేజీ వ్యర్థాలతో నిండి దుర్వాసన వస్తోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. సమస్య పరిష్కరించాలి. - కె.శ్రీనివాస్, స్థానికుడు

సమాధానం: సమస్యను పరిశీలించి సిబ్బందిని పంపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

-ఎన్.ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి

– న్యూస్‌టుడే, మండపేట గ్రామీణం, ద్వారపూడి, రామచంద్రపురం, రాయవరం

వ్యర్థాలు తొలగించారు

ఈనాడు కథనానికి స్పందన

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: ద్రాక్షారామ నుంచి యానాం వెళ్లే రహదారిలో అన్నాయిపేట కూడలి వద్ద చెత్త రోడ్డుపైకి వేసేస్తున్నారు. దీని వల్ల తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోందని ఈ నెల 15న 'రహదారిపై చెత్తతో ఇక్కట్లు' శీర్షికన ఈనాడులో కథనం ప్రచురితం అయ్యింది. దీనిపై పంచాయతీ అధికారులు స్పందించారు. జేసీబీని ఏర్పాటు చేసి రోడ్డు మీదకు వచ్చిన వ్యర్థాలను శుక్రవారం తొలగించారు. గ్రామానికి డంపింగ్‌యార్డు లేకపోవడం వల్ల ఇబ్బంది ఎదురవుతుందని, వర్షాల సమయంలో రోడ్డుపైకి వ్యర్థాలు వస్తున్నాయని సర్పంచి పెమ్మిరెడ్డి దొరబాబు తెలిపారు. ఇబ్బందులు లేకుండా తగు చర్యలు చేపడతామన్నారు.

అనుమతుల్లేని పాఠశాల తాత్కాలికంగా మూత

పామర్రు, న్యూస్‌టుడే: మండలంలోని భట్లపాలిక గ్రామంలో అధికారుల నుంచి ఎటువంటి అనుమతుల్లేకుండా నడుస్తున్న పాఠశాలను తాత్కాలింగా శుక్రవారం నుంచి మూయించివేసినట్లు ఎంఈవో అలజంగి నాగరాజు తెలిపారు. గతంలో సదరు యాజమాన్యం వారు ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకోవడంతో అనుమతుల కోసం ఎదురుచూశారని, అవి ఇప్పటికీ రాకపోవడంతో పాఠశాలను మూయించివేసినట్లు వివరించారు.

సమస్యలపై మండల సమావేశంలో నిలదీత



సమావేశంలో ఎంపీపీ నాగమణి, జడ్పీ టీసీ, అధికారులు

పామర్రు, న్యూస్‌టుడే: కె.గంగవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలపై ఎంపీటీసీ సభ్యులు గళమెత్తారు. శుక్రవారం కె.గంగవరం మండల కార్యాలయంలో ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన సమావేశం జరిగింది. వివిధ శాఖల అధికారులు తమ ప్రగతిని, తమ శాఖల్లో అమలవుతున్న పథకాలను సభ్యులకు వివరించారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ పామర్రులో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ప్రారంభించి ఏడాది దాటుతున్నా ఇప్పటి వరకూ దానికి విద్యుత్తు సదుపాయం ఎందుకు కల్పించలేదని ప్రశ్నించారు. కూళ్ల నుంచి కోలంక వరకూ బ్యాంకు కాల్వ ఆక్రమణలకు గురయ్యి తూటు, గుర్రపుడెక్క పెరిగిపోయిందన్నారు. కూళ్లలో డంపింగ్ యార్డు లేక చెత్త రోడ్ల మీదనే పోయాల్సి వస్తోందని విమర్శించారు. పామర్రు పీహెచ్‌సీ సమస్యపై వైద్యాధికారిణి పి.హర్షిత స్పందిస్తూ డీఎంహెచ్‌వోకు నివేదిక పంపించామని వెల్లడించారు. దీనిపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ నాగమణి ఆదేశించారు. మండలంలో ఉపాధి పథకంలో సిమెంటు రోడ్లు వేయడానికి రూ.1.17 కోట్లు మంజూరయ్యాయని పీఆర్ ఏఈ ఏసురత్నం చెప్పారు. మండలంలో ఆసక్తి ఉన్న పశుపోషకులకు లాభం కలిగేలా గోకులం షెడ్లు నిర్మిస్తామని, 48 మంజూరయ్యాయని ఇప్పటి వరకూ 75 దరఖాస్తులు వచ్చాయని పశువైద్యాధికారి వెల్లడించారు. సమావేశానికి ఇంకా పలు శాఖల అధికారులు హాజరు కాకపోవడంపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. ఎంపీడీవో ఎం.శ్రీనివాసు, తహసీల్దార్ బండి.మృత్యుంజయరావు, జడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి, మండల ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామకార్యదర్శులు పాల్గొన్నారు.

ఆధార్ మార్పులకు ప్రత్యేక శిబిరం

రాయవరం: ఆధార్ కార్డులో నివాసం, పేర్లు తదితర మార్పు, చేర్పులకు రాయవరంలో ప్రత్యేక శిబిరాలను నిర్వహించనున్నట్లు రాయవరం ఎంపీడీవో ఎన్.కీర్తి స్పందన తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి ఉదయం 10 నుంచి సాయంతం 5 గంటల వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. 21న సోమేశ్వరం, 22న వెదురుపాక, 23న రాయవరం, 24, 25 తేదీల్లో మండలంలో మిగిలిన గ్రామాల ప్రజలు రాయవరం సచివాలయం-2లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దుకాణాల్లో తనిఖీలు

మండపేట: ప్లాస్టిక్ కవర్ల నిషేధం అమలులో భాగంగా శుక్రవారం మున్సిపల్ సిబ్బంది పలు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి వాడకం వల్ల పర్యావరణానికి ప్రమాదం వాటిల్లుతుందని, కాలువల్లో మురుగునీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతున్నాయని శానిటరీ ఇన్‌స్పెక్టరు ఎం.సత్తిరాజు వివరించారు. వీటిని ఎవరూ వినియోగించవద్దని పేర్కొన్నారు.

నిర్మాణం పూర్తయ్యేది ఎన్నడో..?

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అందుబాటులో లేని గ్రామాల్లో వైద్య సేవలు అందించే ఆరోగ్య ఉపకేంద్రాల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. గత వైకాపా ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పేరుతో అట్టహాసంగా చేపట్టిన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. కపిలేశ్వరపురం మండలంలోని అచ్యుతాపురం పీహెచ్‌సీ పరిధి నేలటూరులో 20.80 లక్షలతో హెల్త్ క్లినిక్ నిర్మాణం చేపట్టారు. రోజులు గడుస్తున్నా భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో ఆరోగ్య సిబ్బంది స్థానిక పంచాయతీ కార్యాలయంలో వైద్య సేవలందిస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి, నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



దీనిపై మండల ఇంజినీరు డీవీ రాఘవులును వివరణ కోరగా నిధులు సరిపడక పనులు నిలిచిపోయాయని, త్వరలోనే పనులు తిరిగి చేపట్టడానికి చర్యలు చేపడతామన్నారు.

– న్యూస్‌టుడే, అంగర

భూ రీసర్వే సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు

మండపేట, పామర్రు: గత వైకాపా ప్రభుత్వంలో జరిగిన రీసర్వేలో సర్వే నంబర్లు మారడం, తక్కువ కొలతలు చూపించడం తదితర సమస్యలు తలెత్తాయి. ఈ సమస్యను ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియక ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రెవెన్యూ అధికారులు శనివారం నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నారు. రీసర్వే సమస్యలు ఉన్నవారు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభలకు వచ్చి దరఖాస్తులు ఇవ్వాలని మండపేట, కె.గంగవరం తహసీల్దార్లు తేజేశ్వరరావు, బండి మృత్యుంజయరావు తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈ నెల 19వ తేదీ నుంచి నవంబరు 4వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

నియోజకవర్గాల్లో నిర్వహణ ఇలా..

మండపేట నియోజకవర్గంలో 19న మారేడుబాక, 21న ఇప్పనపాడు, 22న వెలగతోడు, 23న ద్వారపూడి, 24న పాలతోడు, 25న మెర్నిపాడు, 26న చిన ద్వారపూడి, 28 జెడ్ మేడపాడు, 29 అర్తమూరు, 30 వేములపల్లి, నవంబరు 1న ఏడిద, 2న తాపేశ్వరం, 4న కేశవరం గ్రామాల్లో నిర్వహించనున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 19న విలాసగంగవరం, 21 తామరపల్లి, 22 ఎర్రపోతవరం, 23 యండగండి, 24 అద్దంపల్లి, 25 పామర్రు, 26 అముజూరు, 28 కె.గంగవరం, 29 కుందూరు, 30న పాణింగిపల్లి, నవంబరు 1న సత్యవాడ, 2న సుందరపల్లి, 4న ఊడిమూడి, 5 కుడుపూరు, 6 కూళ్ల, 7 బాలాంతరం, 8 శివల, 11 గుడిగళ్ల, 12 భట్లపాలిక, 13న దంగేరు, 14న పేకేరు, కోటిపల్లి, 15న కోటల్లో ఈ గ్రామసభలుంటాయని వివరించారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి పరామర్శ

పామర్రు: కూటమి ప్రభుత్వం నేతలు రహదారుల మరమ్మతులకు నిధులు విడుదల చేయాలని రామచంద్రపురం నియోజవకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన కోటిపల్లికి చెందిన పట్నాల శేఖర్‌ను ఆయన శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచి అయినవిల్లి అబ్బు, పి.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కూర్మనాథుని సేవలో రామచంద్రపురం ఆర్డీవో

గార, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లా గార మండలం శ్రీకూర్మంలోని కూర్మనాథ క్షేత్రాన్ని డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం ఆర్డీవో సుధాసాగర్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం సందర్శించారు. అర్చకులు, ఆలయ ఇన్‌ఛార్జి ఈవో గురునాథరావు ఆయనకు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం బేడా మండపంలో ప్రధాన అర్చకుడు చామర్ల సీతారామ నృసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.


సుధాసాగర్‌కు స్వామి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఇన్‌ఛార్జి ఈవో గురునాథరావు

అభివృద్ధి పనులకు భూమిపూజ

పామర్రు, న్యూస్‌టుడే: పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా కె.గంగవరం మండలం పాణింగిపల్లిలో శుక్రవారం సిమెంటు రోడ్డు శంకుస్థాపనకు భూమిపూజ చేశారు. స్థానిక మేకా రాంబాబు ఇంటి నుంచి టేకి డ్రెయిన్ రోడ్డును కలుపుతూ దీన్ని రూ.15 లక్షల వ్యయంతో నిర్మించనున్నారు. కార్యక్రమంలో వాసంశెట్టి సత్యం, గ్రామ కూటమి నాయకులు కొత్తపల్లి మురార్జీ, వెంకట్రావు, బలుసు నాగేంద్ర ప్రసాద్, చీకట్ల అచ్చి, ఎం.కిరణ్, పీఆర్ ఏఈ ఏసురత్నం, గ్రామ కార్యదర్శి ఎం.సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ: పల్లెపండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా పలు గ్రామాల్లో నిర్మించబోయే సీసీ రోడ్ల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యఅతిథిగా మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి సత్యం హాజరయ్యారు. నెలపర్తిపాడులో రూ.7లక్షలు, బాపనయ్యచెరువు గ్రామంలో రూ.3 లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్టు ఎంపీడీవో కె.పద్మజ్యోతి తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు వల్లూరి సురేష్, రాయుడు వీరబాబు, వల్లూరి సత్యనారాయణ, చిట్టూరి సత్యనారాయణ, తాతపూడి కుమార్, పీతల యేసు తదితరులు పాల్గొన్నారు.



నెలపర్తిపాడులో శంకుస్థాపన కార్యక్రమంలో కూటమి నాయకులు

పేదలను గుర్తించి.. పథకాలు అందించి

మండపేట, న్యూస్‌టుడే: వీధి వ్యాపారాలు, కూలి నాలి పనులు చేసుకునే అసంఘటిత కార్మికులను ఆదుకుని వారిని పేదరికం నుంచి విముక్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోంది. 2020లో ప్రధాని నరేంద్ర మోదీ ఇందుకోసం 8 రకాల పథకాలను ప్రవేశపెట్టారు. మండపేట పట్టణం పరిధిలో వీటికి అర్హులను ఎంపిక చేసేందుకు మెప్మా ఆధ్వర్యంలో ఆర్పీలు సర్వే నిర్వహించి వారికి పథకాలు అందేలా కృషి చేస్తున్నారు. ఈ పథకాలను సంబంధించి ఇప్పటి వరకు నిర్వహించిన సర్వే ప్రకారం పట్టణంలో 10,353 మందిని అర్హులుగా గుర్తించారు. వీరిలో 10,165 మంది దరఖాస్తు చేసుకోగా 8,869 మందికి మంజూరు చేశారు.

దరఖాస్తు, మంజూరు ఇలా..

ప్రమాదవశాత్తు మరణం లేదా అంగ వైకల్యం పొందిన వారికి ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన వర్తిస్తుంది. దీనికి ప్రీమియంగా సంవత్సరానికి రూ.20 చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకానికి 4,500 మంది అర్హులుగా గుర్తించగా 4,479 మంది దరఖాస్తు చేసుకోగా అందరికీ మంజూరు చేశారు. ✦ పీఎం జీవన జ్యోతి భామీ యోజన పథకానికి 1 సంవత్సరం కాల పరిమితి ఉంటుంది. సంవత్సర ప్రీమియం రూ.436 చెల్లించాలి. ఈ పథకంలో 3,497 మంది అర్హులు కాగా 3,400 మంది దరఖాస్తు చేసుకున్న అందరికి మంజూరయ్యింది.

అసంఘటిత కార్మికులకు..

వీధి వ్యాపారులు, ఇటుకల బట్టీల్లో పనిచేసే వారు, రజకులు, రిక్షా పుల్లర్లు, భూమి లేని వ్యవసాయ కూలీలు, అసంఘటిత, మధ్యాహ్న భోజన, భవన నిర్మాణ, చేనేత కార్మికులు, నెలవారీ రూ.15,000 లోపు ఆదాయం ఉన్న 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సున్న వారు పీఎం శ్రమయోగి మాన్‌ధన్ పథకానికి అర్హులు. ఈ పథకానికి 1,316 మంది అర్హులను గుర్తించగా 1,296 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఒక్కరికి కూడా ఇంకా మంజూరు కాలేదు. ✦ ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన పథకం ద్వారా బ్యాంకులో ఖాతా తెరిచిన వారికి సేవింగ్స్, డిపాజిట్లు, ఖాతాలు చెల్లింపులు, క్రెడిట్, భీమా, పెన్షన్ పథకాలు పొందేందుకు వీలుంది. ఈ పథకానికి 711 మంది ఖాతాలు తెరిచారు. ✦ ఆహార భద్రతా చట్టం ప్రకారం వన్ నేషన్ వన్ రేషన్ పథకాన్ని 201 మందికి మంజూరు చేశారు. ✦ మాతా శిశు సంక్షేమ కోసం జనని సురక్ష యోజన పథకాన్ని జాతీయ ఆరోగ్య మిషన్ అమలు చేస్తోంది. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవం అయిన తల్లులకు రూ.1400, ఆశ కార్యకర్తకు రూ.600 చెల్లిస్తారు. ఈ పథకం 17 మందికి మాత్రమే అమలు అవుతోంది. ✦ పీఎం మాతృ వందన పథకం ద్వారా తల్లికి ఆర్థిక సహాయం, పిల్లలకు ప్రారంభ టీకాలు ఇస్తారు. ఈ నగదు తల్లుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. ఇంత వరకు ఈ పథకానికి నలుగురు మాత్రమే అర్హత పొందారు. ✦ బీఓసీడబ్ల్యూ చట్టం కార్మిక శాఖ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి సంక్షేమానికి, భద్రత కల్పించేందుకు ఉపయోగపడుతుంది.


మెప్మా కార్యాలయంలో ఆర్పీలకు అవగాహన కల్పిస్తున్న సుజాత

అవగాహన కల్పిస్తున్నాం..

ఆర్పీల ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలకు అర్హులందరూ నమోదు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. ఎప్పటికప్పుడు ఆయా పథకాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాం.

- సుజాత, సాంకేతిక నిపుణులు, మెప్మా, మండపేట